


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 23-1-2026 | పేజీలు: 12 + 10 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 317 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి రా.1:46 తదుపరి షష్ఠి, నక్షత్రం: పూర్వాభాద్ర మ.2:33 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.12:02-1:37, దుర్ముహూర్తం: ఉ.9:06-9:50, మ.12:49-1:33, అమృతఘడియలు: శేషం ఉ.8:07, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:52, సూర్యాస్తమయం: 6:01 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru







యువసారధికి
జన్మదిన శుభాకాంక్షలు



భావితరాల
భవిష్యత్తుకు ఆశాజ్యోతి,
యువ నాయకుడు,
అవిశ్రాంత పోరాట యోధుడు
ఆం.ప్ర. ఐటి, ఎలక్ట్రానిక్స్ &
కమ్యూనికేషన్స్, మానవ వనరులు,
విద్యాశాఖామాత్యులు
శ్రీ నారా లోకేష్ గారికి
నా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
మీరు నిండు నూరేళ్ళు
ఆయురారోగ్యాలతో
ఉండాలని మనసారా
కోరుకుంటూ..





మీ
భాష్యం ప్రవీణ్
శాసనసభ్యులు, పెదకూరపాడు నియోజకవర్గం



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 23-1-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుంటూరు సిటీ

విజయసాయి తన పేరు చెప్పాడేమోనని జగన్ భయం: మంత్రి పయ్యావుల

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఈడీ విచారణకు హాజరైన విజయసాయి రెడ్డి... మద్యం కుంభకోణంలో ఎక్కడ తన పేరు చెప్పాడో అనే భయంతో జగన్ వణుకుతున్నారు. దానిపై ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రెస్‌మీట్ పెట్టి అసత్య ప్రచారాలు మొదలు పెట్టారు' అని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విజయసాయిరెడ్డి దెబ్బకు మనశ్శాంతి కోల్పోయిన జగన్ తన బాధని ప్రజల బాధగా చిత్రీకరిస్తూ... ప్రజలకు మనశ్శాంతి లేదంటున్నారు. క్రెడిబిలిటీ, క్రెడిట్ లేనివాడు క్రెడిట్ చోరీ అనడం విడ్డూరంగా ఉంది.. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా దోపిడీకి తెరలేపింది జగన్. రీసర్వేకి, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌కు తేడా తెలియకుండా మాట్లాడుతున్నారు' అని పయ్యావుల విమర్శించారు.

ఈడీ విచారణ డైవర్షన్ కోసమే జగన్ ప్రెస్‌మీట్: పల్లా

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'లిక్కర్ స్కాంపై ఈడీ విజయసాయి రెడ్డిని, మిథున్‌రెడ్డినీ విచారణ చేస్తోంది. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే జగన్ హడావిడిగా విలేకరుల సమావేశం పెట్టి అబద్ధాలు వల్లెవేశారు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో విమర్శించారు. 'కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో 70 శాతంపైగా భూసర్వే అక్రమాలపై వస్తున్నవే. జగన్ భూసర్వేలో కుట్ర లేకుంటే ఇన్ని ఫిర్యాదులు ఎందుకు వస్తాయి? జగన్ సొంత జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరానికి చెందిన చేనేత కుటుంబానికి చెందిన సుబ్బారావు భూరికార్డులను తారుమారు చేయడంతో ఆయన కుటుంబంతోసహా ఆత్మహత్య చేసుకుని చనిపోయింది వాస్తవం కాదా? కూటమి ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 5 లక్షల ఎకరాలకుపైగా అసైన్డ్ భూములు కబ్జాకు గురైనట్లు వెల్లడైంది. భూకబ్జాలను కప్పిపెట్టుకునేందుకు మదనపల్లెలో ఫైళ్లను తగులబెట్టించింది వాస్తవం కాదా' అని ప్రశ్నించారు.

క్యారెక్టర్ లేని జగన్ క్రెడిట్ చోరీపై మాట్లాడుతున్నారు: గొట్టిపాటి

క్యారెక్టర్ లేని జగన్ క్రెడిట్ గురించి మాట్లాడుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'విద్యుత్ శాఖను సర్వనాశనం చేసినందుకు జగన్‌కు క్రెడిట్ ఇవ్వాలి. రూ.30 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసినందుకు, 9 సార్లు చార్జీలు పెంచినందుకు, పీపీఏలను రద్దు చేసినందుకు ఆయనకు క్రెడిట్ ఇవ్వాలి. జగన్ అధికారంలో ఉండి ఉంటే రాష్ట్రం అప్పుల కుప్పగా మారేది. రాష్ట్రాన్ని గంపగుత్తగా చోరీ చేసిన జగన్, క్రెడిట్ చోరీ గురించి మాట్లాడితే జనం నవ్వుతున్నారు' అని ఎద్దేవా చేశారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే పాదయాత్ర: యనమల

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జగన్ స్వార్థ ప్రయోజనాల కోసమే పాదయాత్ర చేస్తానంటున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. 'ఒకసారి కుర్చీ ఇచ్చినందుకే రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. మరోసారి ఇస్తే రాష్ట్రం అధోగతి పాలే. జగన్ పాలనలో అవినీతి, దోపిడీ, వ్యవస్థీకృత నేరాలు, శాంతిభద్రతల వైఫల్యంతో రాష్ట్రం నిండిపోయింది. ఆయన ప్రవర్తన హిట్లర్, తుగ్లక్, ముస్సోలినీ తరహాలో ఉంటుంది. ఆయన్ని ప్రజలు ఎప్పటికీ నమ్మరు' అని మండిపడ్డారు.

ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా జగన్ కుట్రలు

- మోకాళ్ల యాత్ర చేసినా అధికారంలోకి రాలేడు: బుద్దా వెంకన్న

విజయవాడ అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా జగన్ కుట్రలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. గురువారం విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పులివెందుల ఎమ్మెల్యే పాదయాత్ర కాదు.. మోకాళ్ల యాత్ర చేసినా ఆయన అధికారంలోకి రాలేడు. ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉండగానే పాదయాత్ర చేస్తానని జగన్ చెప్పటం హాస్యాస్పం. నేటి అభిమన్యుడు మంత్రి లోకేశ్‌కు పద్మవ్యూహాన్ని ఛేదించటమే కాకుండా బయటకు రావటం కూడా తెలుసు. ప్రభుత్వ భూములు అన్యాయంగా ఇచ్చారంటూ బ్లూ మీడియా అబద్ధపు ప్రచారాలు చేస్తోంది.

ముడుపుల కోసమే..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించగా... అప్పటి ముఖ్యమంత్రి జగన్ సలహాదారు రాజ్ కసిరెడ్డి పేరు చెప్పినట్లు సమాచారం. అప్పట్లో నిర్దిష్టంగా కొన్ని డిస్టిలరీల నుంచే 75 శాతం మద్యాన్ని కొనుగోలు చేయడానికి కారణమేమిటని ప్రశ్నించగా... 'కమీషన్ల కోసమే' అని సాయిరెడ్డి బదులిచ్చినట్లు తెలిసింది. మార్కెట్లో వినియోగంలో ఉన్న ప్రసిద్ధ బ్రాండ్లను పథకం ప్రకారం తప్పించడం వెనుక ఎవరి పాత్ర ఉందని ప్రశ్నించినప్పుడు.. "మీకు అన్నీ తెలుసు. ఇప్పటికే సిట్ ద్వారా అన్నీ తెలుసుకున్నారు కదా! ఇక నేను చెప్పేది ఏముంటుంది!" అని సాయిరెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. 'దీని వెనుక ఎవరున్నారు? అప్పటి ప్రభుత్వంలో ముఖ్యులా లేక అధికారులా?' అని ప్రశ్నించగా... 'అందరూ ఉన్నారు' అంటూ సాయిరెడ్డి కొందరి పేర్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రకరకాల పేర్లతో స్థానిక బ్రాండ్లను ప్రవేశపెట్టడం వెనుక ఎవరి పాత్ర ఉందనే ప్రశ్నకు సాయిరెడ్డి సూటిగా చెప్పలేదు. "ఇబ్రహీంపట్నం నుంచి తంబళ్లపల్లె వరకూ తీగ బయటికి వచ్చింది. అదంతా పత్రికల్లో చూశా. నాకు ఆ విషయాల గురించి తెలియదు" అని చెప్పినట్లు సమాచారం.

డబ్బులెలా పోయాయంటే...: మద్యం ముడుపుల వసూలు, వాటిని ఎక్కడెక్కడికి, ఎలా చేరవేశారనే అంశంపై సాయిరెడ్డిని ఈడీ సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ వివరాలను ఆయన కొంత వివరంగానే వెల్లడించినట్లు సమాచారం. "హైదరాబాద్‌కన్నా ముంబై నుంచే డబ్బు బయటికి ఎక్కువగా వెళ్లింది. అందులో నాకు కొన్నే తెలుసు" అంటూ కొన్ని ఆధారాలను కూడా ఈడీకి అందించినట్లు తెలిసింది. ఎంత మొత్తం ఎటు వెళ్లింది, తరలించిన వ్యక్తులెవరు, హవాలా చేసిందెవరు.. తదితర వివరాలు అందులో ఉన్నట్లు సమాచారం. ఆ డాక్యుమెంట్లను ఈడీ అధికారులు అప్పటికప్పుడే స్కాన్ చేసి ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి పంపగా... వాటన్నింటినీ పరిశీలించి, అవి కీలకమైన ఆధారాలుగా గుర్తించినట్లు సమాచారం. వందల కోట్ల మనీ రూటింగ్‌తోపాటు సూట్ కేసు కంపెనీల వివరాలు కూడా సాయిరెడ్డి అందజేసినట్లు తెలిసింది. మద్యం స్కామ్‌లో ఏ1 రాజ్ కసిరెడ్డితో లావాదేవీలు జరిపిన ముంబై హవాలా వ్యాపారులతోపాటు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి పాత్రపైనా ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. తనకు తానే విజిల్ బ్లోయర్‌గా మారానని, ఏదీ దాచకుండా తెలిసిన విషయాలన్నీ చెబుతానని సాయిరెడ్డి అనడంతో... అవసరమైతే మళ్లీ పిలుస్తామంటూ ఈడీ అధికారులు ఆయనను పంపించారు. లిక్కర్ స్కామ్‌లో ఏ-1 రాజ్ కసిరెడ్డిని విజయవాడ జైలులో ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఆ తర్వాత... ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం వద్ద ఉన్న శర్వాణీ డిస్టిలరీస్ చంద్రారెడ్డి, మహేశ్వర సింగ్‌లను విచారించారు. శుక్రవారం వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని హైదరాబాద్‌లో ప్రశ్నించనున్నారు.

ఆ కోటరీ, ఈ కూటమి ఉన్నన్నాళ్లు జగన్‌కు అధికారం కల్ల!

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయినట్లు జగన్ ఆరోపించారని సాయిరెడ్డి ఆక్రోశించారు. ప్రలోభాలకు లొంగి ఉంటే లక్షల కోట్లు ఆర్జించేవాడినన్నారు. ఆ మాట వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలేరులాగా తాను కష్టపడి పండించిన పంటను తింటున్న 'పంది కొక్కులు' అంటూ కోటరీపై ధ్వజమెత్తారు. గురువారం హైదరాబాద్‌లో ఈడీ విచారణకు హాజరైన అనంతరం సాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. వైసీపీలో నంబర్ 2 స్థానంలో ఉండీ లిక్కర్ స్కామ్ గురించి తెలియదనడం కరెక్ట్ కాదేమో అని ఈడీ అధికారులు తనతో అన్నారని సాయిరెడ్డి తెలిపారు. "ప్రాంతీయ పార్టీల్లో నంబర్ 2 ఉండదని అనేకసార్లు చెప్పాను. నేను పార్టీలో ఉన్నప్పుడు కోటరీ నన్ను నంబర్ 2గా అంగీకరించలేదు. పార్టీ వదిలిపోయాక... కేసులు చుట్టుముట్టిన తర్వాత వైసీపీ సోషల్ మీడియా నన్ను 'నంబర్ 2' అని ప్రచారం చేస్తోంది. 2019లో అధికారంలోకి వచ్చాక సంవత్సరం పాటు నాకు జగన్ నంబర్ 2 స్థానం ఇచ్చారు. ఆయన హృదయంలో కూడా అదే స్థానం ఇచ్చారు. ఆ తర్వాత ఆయన మనస్సులో నుంచి నేను జారిపోతూ వచ్చాను. పనికి మాలిన కోటరీ వల్లే ఇది జరిగింది. వెన్నుపోటు పొడుస్తానేమోనన్న అభద్రతా భావం కల్పించారు. 2020 నుంచి నన్ను పక్కన పెట్టారు. దీంతో పార్టీలో ఇమడలేక, కోటరీ వేధింపులు తట్టుకోలేక, అవమానాలు భరించలేక పార్టీ వదిలి వెళ్లిపోయాను. ఈ కోటరీ ఉంటే జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు. ఈ కూటమి కొనసాగితే జగన్ అధికారంలోకి రాలేరు. తగిన వ్యూహాన్ని ఇచ్చే, అమలు చేసే వారు కోటరీలో లేరు. జగన్ చుట్టూ ఉన్న వాళ్లంతా ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారు" అని సాయిరెడ్డి పేర్కొన్నారు. తాను వందలకోట్లు సంపాదించినట్లుగా జగన్ సోషల్ మీడియా, ఆయన కోటరీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తాను విశాఖలో ఆస్తులు పోగేసుకున్నట్లుగా 'సిట్' కూడా రిపోర్టు పంపిందన్నారు. 'అరబిందో ఆస్తులన్నీ నావి అవుతాయా' అని ప్రశ్నించారు. ఏడాదిపాటు రాజకీయాలకు దూరంగా ఉండాలనుకున్నానని, ఆ గడువు త్వరలో ముగుస్తుందని తెలిపారు. "నా కోరికంతా రాజకీయాల్లోకి తిరిగి రావాలి. తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలి. నా మీద దుష్ప్రచారం చేసిన వాళ్లకు బుద్ధి చెప్పాలి. ఏ రాజకీయ పార్టీలోనూ చేరను. నా రాజకీయ భవిష్యత్తు త్వరలో ప్రకటన చేస్తాను" అని సాయిరెడ్డి తెలిపారు. మోదీ సమర్థ నాయకుడని ప్రశంసించారు. ఏపీలో ప్రతిపక్షం అధికార పక్షాన్ని విమర్శించడంలేదని చెప్పారు.

ఆ కులం కాదని నిరూపించాల్సింది అధికారులే!

కుల ధ్రువీకరణ పత్రం రద్దుపై హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తికి అప్పటికే ఉన్న కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని భావించినప్పుడు, అతను ఆ కులానికి చెందిన వ్యక్తికాదని నిరూపించాల్సిన బాధ్యత ఫిర్యాదుదారు, కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తున్న అధికారులదేనని హైకోర్టు తేల్చిచెప్పింది. తండ్రి సామాజిక హోదానే పిల్లలకు వర్తిస్తుందని శ్యామల రామరాజు కేసులో ఉమ్మడి హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేసింది. ఓ భూవివాదంలో రామకృష్ణ తండ్రి బెన్నాస్వామి, నాయనమ్మ మంగమ్మను ఏజెన్సీ కోర్టు గిరిజనులుగా గుర్తించిందని పేర్కొంది. అట్లపాకల ఇంటి పేరుతో గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ సమర్పించిన 1938 నాటి భూరికార్డుల ఆధారంగా చేసుకొని రామకృష్ణను గిరిజనేతరుడిగా ప్రకటించడం అహేతుకమని పేర్కొంది. పిటిషనర్ అట్లపాక రామకృష్ణ ఎస్టీ(కొండకాపు) కాదంటూ 2005లో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులతోపాటు వాటిని ఖరారు చేస్తూ 2009లో సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఇటీవల తీర్పు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి మండలం లగరాయి గ్రామానికి చెందిన అట్లపాకల రామకృష్ణ విద్యాభ్యాసం మొత్తం ఏజెన్సీలోనే జరిగింది. లగరాయి జడ్పీ హైస్కూల్‌లో సైతం రామకృష్ణను ఎస్టీ(కొండకాపు) కులస్తుడిగా నమోదు చేశారు. బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న సమయంలో రామకృష్ణ ఎస్టీ కాదంటూ ఏఎన్‌యూ అధికారులకు ఫిర్యాదు అందింది. విచారణ జరిపిన అధికారులు 1938 నాటి భూరికార్డులను ఆధారంగా చేసుకొని రామకృష్ణ కొండకాపు కాదంటూ యూనివర్సిటీకి సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత రామకృష్ణకు నోటీసు ఇవ్వకుండానే, వివరణ తీసుకోకుండానే ఎస్టీ కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ 2005లో కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులపై రామకృష్ణ సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి వద్ద అప్పీల్ వేయగా ఊరట లభించలేదు. దాన్ని సవాల్ చేస్తూ రామకృష్ణ అదే ఏడాది హైకోర్టులో పిటిషన్ వేశారు.



విలేకరుల సమావేశంలో విక్రమ్ నారాయణరావు, బాలలత తదితరులు

'ధనిక్ భారత్'తో ఒత్తిడి లేని విద్య

- తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ విద్య బలోపేతానికే ధనిక్ భారత్ విద్యా సంస్థలు..
- లాయిడ్ గ్రూప్ అధినేత విక్రమ్ నారాయణరావు

హైదరాబాద్ సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒత్తిడి లేని నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా 'ధనిక్ భారత్' విద్యా సంస్థలను ప్రారంభిస్తున్నామని లాయిడ్ గ్రూప్ అధినేత, ధనిక్ భారత్ వ్యవస్థాపకులు విక్రమ్ నారాయణరావు ప్రకటించారు. తమ విద్యా సంస్థల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ విద్య బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లాయిడ్ సంస్థకు ఫార్మా రంగంలో ప్రత్యేక గుర్తింపు ఉందని, సమాజానికి ఏమైనా చేయాలనే ఆలోచనతో వ్యాపార సంస్థగా కాకుండా విద్యారంగంలో ప్రత్యేక కృషి చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇందులో భాగంగా 2026-27 విద్యా సంవత్సరానికి ధనిక్ భారత్ విద్యా సంస్థలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఇంటర్ విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించే విధంగా కృషి చేస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో ఈ సంవత్సరం 16 బ్రాంచీలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. రెసిడెన్షియల్, సెమీ రెసిడెన్షియల్, డేస్కాలర్ నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ఆరు బ్రాంచీలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే, తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా విద్యాసంస్థల్లో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది దాదాపు 250మందికి రూ.20లక్షల ప్రమాద బీమా, రూ.3లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని ప్రకటించారు. ఇక, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి వ్యవస్థాపకురాలు, ధనిక్ భారత్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎం.బాలలత మాట్లాడుతూ దేశంలో ఇంటర్ విద్యలో సమూల మార్పులు తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. పరీక్షలు, ర్యాంకుల కోసం విద్యార్థులపై ఒత్తిడి పెంచకుండా విభిన్నమైన మెథడాలజీతో ర్యాంకులు పొందే విధంగా చేస్తామన్నారు. బట్టీపట్టే చదువులు కాకుండా స్మార్ట్‌గా విద్యను అభ్యసించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ అధ్యాపకులు విక్రమ్ సురేంద్రబాబు, కే సాంబశివరావు, కే రవీంద్ర కుమార్, ఏ గిరిబాబు, ఏ రాంబాబు. ఎం మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★


ఆస్కార్ రేసు నుంచి వైదొలగిన హోమ్‌బౌండ్


అత్యధిక నామినేషన్లతో రికార్డు సృష్టించిన సిన్నర్స్



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూసిన 98వ ఆస్కార్ అవార్డుల నామినేషన్ల జాబితా విడుదలైంది. అయితే, భారతీయ సినీ అభిమానులకు నిరాశే ఎదురైంది. భారతదేశం నుంచి అధికారిక ఎంట్రీగా వెళ్లిన 'హోమ్‌బౌండ్' చిత్రం ఆస్కార్ రేసు నుంచి నిష్క్రమించింది. మరోవైపు హాలీవుడ్ చిత్రం 'సిన్నర్స్' ఆస్కార్ చరిత్రలోనే అత్యధిక నామినేషన్లతో రికార్డు సృష్టించింది.

- 98వ ఆస్కార్ అవార్డు నామినేషన్లలో ర్యాన్ కూగ్లర్ దర్శకత్వం వహించిన 'సిన్నర్స్' ఏకంగా 16 విభాగాల్లో నామినేట్ అయింది. ఆ తర్వాత స్థానంలో పాల్ థామస్ అండర్సన్ చిత్రం 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' 13 నామినేషన్లతో నిలిచింది. ఈ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 15న లాస్ ఏంజెలెస్‌లో జరగనుంది.





లియోనార్డో డికాప్రియో



ర్యాన్ కూగ్లర్



ఎమ్మాస్టోన్

నిరాశపరిచిన హోమ్‌బౌండ్

నీరజ్ ఘైవాన్ దర్శకత్వంలో ధర్మ ప్రొడక్షన్స్ నిర్మించిన 'హోమ్‌బౌండ్' చిత్రం ఉత్తమ అంతర్జాతీయ చలనచిత్రం విభాగంలో పోటీపడింది. విశాల్ జెత్వా, ఇషాన్ ఖట్టర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా షార్ట్‌లిస్ట్ వరకూ వెళ్లగలిగింది. కానీ తుది జాబితాలో (నామినేషన్లలో) చోటు దక్కించుకోలేకపోయింది. ఒకవేళ ఎంపికై ఉంటే, 'లగాన్' తర్వాత ఈ విభాగంలో నామినేట్ అయిన భారతీయ చిత్రంగా నిలిచేది.

ప్రధాన విభాగాల నామినేషన్ల జాబితా

ఉత్తమ చిత్రం విభాగం: సిన్నర్స్, వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్, హ్యామ్‌నెట్, మార్టి సుప్రీమ్, బుగోనియా, ఫ్రాంకెన్‌స్టైన్, సెంటిమెంటల్ వాల్యూ, ది సీక్రెట్ ఏజెంట్, ట్రైన్ డ్రీమ్స్, ఎఫ్ 1

ఉత్తమ నటుడు విభాగం: మైఖేల్ బీ జోర్డాన్ (సిన్నర్స్), లియోనార్డో డికాప్రియో (వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్), తిమోతి చాలమెట్ (మార్టీ సుప్రీమ్), ఈథన్ హాక్ (బ్లూ మూన్) వాగ్నర్ మౌరా (ది సీక్రెట్ ఏజెంట్)


ఉత్తమ నటి విభాగం: ఎమ్మా స్టోన్ (బగోనియా), జస్సీ బక్లీ (హ్యామ్‌నెట్), రెనేట్ రీన్స్‌వే (సెంటిమెంటల్ వాల్యూ), కేట్ హడ్సన్ (సాంగ్ సంగ్ బ్లూ), రోజ్ బైర్న్ (ఇఫ్ ఐ హ్యాడ్ లెగ్స్ ఐ వుడ్ కిక్ యూ)

ఉత్తమ దర్శకుడు విభాగం: ర్యాన్ కూగ్లర్ (సిన్నర్స్), పాల్ థామస్ అండర్సన్ (వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్), క్లో జావో (హ్యామ్‌నెట్), జాష్‌సాఫ్దీ (మార్టీ సుప్రీమ్), జోచిమ్ ట్రైయర్ (సెంటిమెంటల్ వాల్యూ)

ఉత్తమ అంతర్జాతీయ చిత్రం: ది సీక్రెట్ ఏజెంట్ (బ్రెజిల్), ఇట్ వజ్ జస్ట్ ఆన్ ఆక్సిడెంట్ (ఫ్రాన్స్), సెంటిమెంటల్ వాల్యూ (నార్వే), సిరత్ (స్పెయిన్), ది వాయిస్ ఆఫ్ హింద్ రజబ్ (తునీషియా)

'ఒరేయ్' అని పిలుస్తుంటే పొంగిపోతా

-రజనీకాంత్



మన స్నేహితులు ఎంతో ప్రేమగా 'రేయ్', 'ఒరేయ్' అంటూ పిలిచే పిలుపు వింటే ఎంతో సంతోషం వేస్తుందని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. కోయంబత్తూరు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 1975-79 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పురస్కరించుకుని బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రజనీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పాత స్నేహితులను చూడగానే కలిగే సంతోషం వర్ణించలేనిది. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన మీరంతా సుమారు 50 యేళ్ళ తర్వాత కలుసుకున్నారు. పెద్దవారైన మీరంతా భర్త, తండ్రి, తాత, సర్, మచ్చాన్ ఇలా పలు విధాలుగా గౌరవంగా పిలుచుకున్నప్పటికీ, పాత స్నేహితులు మనల్ని పేరుపెట్టి, ఒరేయ్, రేయ్ అంటూ పిలిచే పిలుపు ఎక్కడ లేని సంతోషాన్నిస్తుంది. నేను ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి బెంగుళూరు వెళ్ళి నాతో కలిసి పనిచేసిన డ్రైవర్లు, కండక్టర్లను కలుసుకుంటాను. శివాజీ అనే నా ఒరిజినల్ పేరును నేను మరిచిపోయాను. కానీ, నా స్నేహితులు 'రేయ్ శివాజీ' అంటూ పిలుస్తుంటే నాకు కలిగే సంతోషాన్ని వర్ణించడానికి మాటలు లేవు. మీరు కూడా అవకాశం ఉన్నపుడల్లా మీ పాత స్నేహితులను కలుసుకోండి. ఆ కలయిక మీలో కొత్త ఉత్తేజాన్నిస్తుంది." అని పేర్కొన్నారు.

-చెన్నై, (ఆంధ్రజ్యోతి)

మళ్లీ సంక్రాంతికే

- అనిల్ రావిపూడి



'నా పదో సినిమాకి ఐడియా వచ్చేసింది. ఈసారి టైటిల్ అనౌన్స్‌మెంట్ నుంచే ఒక విచిత్రమైన జర్నీ ప్రారంభం కాబోతుంది. ఈ ఏడాది జూన్, జూలై నాటికి సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది. సంక్రాంతికే వస్తుంది' అని తన తదుపరి ప్రాజెక్టు గురించి వివరించారు దర్శకుడు అనిల్ రావిపూడి. చిరంజీవి, నయనతార జంటగా ఆయన రూపొందించిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా ఈ సంక్రాంతికి విడుదలై మంచి విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

- చిరంజీవి గారితో కచ్చితంగా సినిమా చేయాలనే పట్టుదలతో 'మన శంకరవరప్రసాద్ గారు' కథని సిద్ధం చేశాను. చిరంజీవి గారిని నాకు నచ్చినట్లు చూపించాలనే తపనో ఏమో కానీ, కథను చాలా సులువుగా రాసేశాను. మేము అనుకున్నవన్నీ చక్కగా కుదిరాయి. నా కెరీర్‌లో చాలా వేగంగా పూర్తిచేసిన స్క్రిప్ట్ ఇది.
- 'సంక్రాంతికి వస్తున్నాం', 'భగవత్‌సింగ్ కేసరి' చిత్రాలను రిమేక్ చేసే అవకాశం వచ్చినా చేయలేదు. ఇలాంటి చిత్రాలను పాన్ ఇండియా స్థాయిలో తీయడం పెద్ద రిస్క్. వెంటనే కాదు గానీ.. భవిష్యత్తులో చిరంజీవిగారితో మరో సినిమా తప్పకుండా చేస్తా.

గాయని ఎస్.జానకికి పుత్రశోకం





ప్రముఖ గాయని ఎస్.జానకి ఏకైక కుమారుడు మురళీ కృష్ణ గురువారం ఉదయం మైసూరులో హఠాన్మరణం పొందారు. ఆయన వయసు 65 సంవత్సరాలు. మురళీకృష్ణ భరతనాట్య కళాకారుడు. నటుడు, రచయిత కూడా. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వర్ష రెండేళ్ల క్రితం కన్ను మూశారు. హైదరాబాద్‌లో జానకితో కలసి మురళీకృష్ణ ఉండేవారు. 'శ్రుతిలయలు' చిత్రంలో తొలిసారిగా నటించిన మురళీకృష్ణ ఆ తర్వాత 'వినాయకుడు', 'మల్లెపువ్వు' చిత్రాల్లో నటించారు. 'కూలింగ్ గ్లాస్' అనే కన్నడ చిత్రానికి మాటలు రాశారు. జానకమ్మకు ఎంతో అండగా ఉండేవారాయన. గతంలో తన తల్లి అనారోగ్యం గురించి వచ్చిన వార్తల్ని ఆయన ఖండించారు.

అతనితో ప్రేమలో ఉన్నా

-ఫరియా అబ్దుల్లా



'జాతిరత్నాలు' చిట్టి, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా ప్రేమలో పడ్డారు. ఈ విషయాన్ని ఆమే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'నేను ప్రేమించే వ్యక్తి ముస్లిం కాదు హిందువే. తను కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. ఈ మధ్య నేను చేస్తున్న సినిమాల్లో నా డ్యాన్స్ ఇంప్రూవ్ కావడానికి ముఖ్య కారణం ఆయనే. మా ఇద్దరి మధ్య ఉన్న బంధం ఎంతో ప్రత్యేకమైనది. ఇద్దరం కలసి ఓ టీమ్‌లా ముందుకెళ్తున్నాం. ఆయన ప్రోత్సాహంతో నా వ్యక్తిగత జీవితాన్ని, వర్క్ లైఫ్‌ను సునాయాసంగా బ్యాలెన్స్ చేయగలుగుతున్నా' అని చెప్పారు. ఇటీవలే విడుదలైన 'గుర్రం పాపిరెడ్డి', 'అనగనగా ఒక రాజు' చిత్రాలతో ప్రేక్షకులను పలకరించారు ఫరియా అబ్దుల్లా.

సంజయ్ లీలా భన్సాలీకి అరుదైన గౌరవం

రిపబ్లిక్ డే పరేడ్‌లో భన్సాలీ రూపొందించిన శకటం



ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు 'మాస్టర్ క్రాఫ్ట్‌మాన్' సంజయ్‌లీలా భన్సాలీకి అత్యంత అరుదైన గౌరవం దక్కింది. జనవరి 26న న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరగనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో భారతీయ సినిమా ఘనతను ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. 113 ఏళ్ల భారతీయ చలనచిత్ర చరిత్రలోని మజిలీలను, అత్యుత్తమ ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపించే ఒక ప్రత్యేక శకటాన్ని ఆయన రూపొందించారు. రణ్‌బీర్‌కపూర్, అలియాభట్ జంటగా 'లవ్ అండ్ వార్' అనే భారీ యుద్ధ ప్రేమకథా చిత్రాన్ని ప్రస్తుతం సంజయ్‌లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా పనుల్లో తీరికలేకుండా ఉన్నప్పటికీ కేంద్ర సమాచార ప్రసార శాఖ నుంచి వచ్చిన ఆహ్వానాన్ని ఆయన తిరస్కరించలేకపోయారు. గత రెండునెలలుగా రాత్రింబవళ్లు శ్రమించి ఈ శకటాన్ని తీర్చిదిద్దారు.

చరిత్రలో నిలిచిపోయేలా

భన్సాలీ రూపొందించిన ఈ శకటం, భారతీయ సినిమా 113 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించేలా ఉంటుందని సమాచారం. కేవలం బాలీవుడ్‌కే పరిమితం కాకుండా, ప్రాంతీయ భాషా చిత్రాల గొప్పతనాన్ని కూడా ఇందులో పొందుపరిచినట్లు తెలుస్తోంది. భారతీయ సినిమా చరిత్రలో ఒక దర్శకుడు రిపబ్లిక్ డే పరేడ్‌లో ఇలాంటి ప్రదర్శనను రూపొందించడం ఇదే తొలిసారి కావడం విశేషం. 'భారతీయ సినిమా గర్వించదగ్గ క్షణాలను ఒకే చోట ఆవిష్కరించే అవకాశం కావడంతో భన్సాలీ ఈ బాధ్యతను స్వీకరించినట్లు ఆయన టీమ్ తెలిపింది.

కాప్రిసియో టూర్ విజయవంతమవ్వాలి



'బ్యాండ్ కాప్రిసియో' యూఎస్‌ఏ టూర్‌ను నిర్వహిస్తుండడం ఆనందాన్నిస్తోంది. వీరి ప్రయత్నం విజయవంతం కావాలి' అని గాయని సునీత అన్నారు. తెలుగు బ్యాండ్ కాప్రిసియో 'ద రైజ్ టూర్ యూఎస్‌ఏ 2026' పేరుతో అమెరికాలోని 30 నగరాల్లో ఫిబ్రవరి నుంచి మార్చి వరకూ తొలి దశ టూర్ నిర్వహించనుంది. గురువారం ఈ బ్యాండ్ టూర్ పోస్టర్‌ను సునీత ఆవిష్కరించారు.

'గొల్ల రామవ్వ' వీరగాథ



తాళ్లూరి రామేశ్వరి టైటిల్ పాత్ర పోషించిన చిత్రం 'గొల్ల రామవ్వ'. భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాటగాథను దృశ్యరూపంగా ముళ్లపూడి వరా తెరకెక్కించారు. రామ్ విశ్వాస్ హనూర్కర్, రాఘవేంద్రవర్మ(బుజ్జి) నిర్మించారు. ఈనెల 25నుంచి 'ఈటీవీ విన్'లో స్ట్రీమింగ్ కానుంది. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవీ మాట్లాడుతూ 'మా నాన్నగారు రాసిన గొప్ప కథల్లో ఒకటైన 'గొల్ల రామవ్వ'ను ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రం తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం దక్కించుకుంటుంది' అని అన్నారు. కార్యక్రమంలో పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకరరావు, గీత రచయితలు కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్, నటుడు రాజీవ్ కనకాల, 'రజాకార్' దర్శకుడు యాటా సత్యనారాయణ, సీనియర్ దర్శకుడు ఉదయభాస్కర్, చిత్రదర్శకుడు ముళ్లపూడి వరా, చిత్ర నిర్మాతలు తదితరులు పాల్గొన్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 23-1-2026 | Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

'ఏఎస్‌సీ అర్జున్'.. ఆన్ డ్యూటీ!



దేశంలోనే తొలిసారిగా విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రోబో సేవలు ప్రారంభం

స్టేషన్‌లో దొంగలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గుర్తింపు

ప్రయాణికులకు భద్రతపై సూచనలు కూడా..

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ

4

ముడుపుల కోసమే!

కొన్ని డిస్టిలరీలకే ఎక్కువ ఆర్డర్లు

పాపులర్ బ్రాండ్లను తప్పించారు.. అనామక బ్రాండ్లను తెప్పించారు

ఇదంతా చేసిందెవరో మీకూ తెలుసు

'సిట్' ఇప్పటికే అన్నీ తేల్చింది కదా!

ఈడీ ముందు గుట్టువిప్పిన సాయిరెడ్డి!?

హవాలాపై పలు ఆధారాల సమర్పణ

లిక్కర్ స్కామ్‌లో 7 గంటలు ప్రశ్నించిన ఈడీ

కీలక అంశాలపై వరుస ప్రశ్నలు

విజిల్ బ్లోయర్‌గా తెలిసినదంతా చెబుతానని వెల్లడి

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన మద్యం స్కామ్‌లో కీలక వివరాలు రాబట్టడంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దృష్టి సారించింది. లిక్కర్ పాలసీ రూపకల్పన నుంచి కమీషన్ల వసూలు వరకూ ముఖ్యపాత్ర పోషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ మాజీ నేత విజయసాయి రెడ్డిని ఈడీ అధికారులు గురువారం హైదరాబాద్‌లో ఏడు గంటలు ప్రశ్నించారు. మద్యం పాలసీపై తన సమక్షంలో మూడుసార్లు భేటీలు జరిగాయని ఆయన చెప్పినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... "ఎక్సైజ్ మంత్రి, అధికారులు, ప్రభుత్వంలో ఉన్న వారు రూపొందించాల్సిన లిక్కర్ పాలసీలో ఒక పార్లమెంటు సభ్యుడైన మీరు ఎందుకు కల్పించుకున్నారు? పాలసీ రూపకల్పనలో మీ పాత్ర ఏంటి?" అని సాయిరెడ్డిని ఈడీ ప్రశ్నించింది. ప్రైవేటు మద్యం దుకాణాలు తీసేసి, ప్రభుత్వమే మద్యం వ్యాపారంలోకి దిగాలని ఎందుకు, ఎలా నిర్ణయించారని కూడా ప్రశ్నించినట్లు సమాచారం. "ఆ విధానాన్ని సూచించింది ఎవరు?" అని సాయిరెడ్డిని

మిగతా IVవ పేజీలో...

ఆ కోటరీ, ఈ కూటమి ఉన్నన్నాళ్లు

జగన్‌కు అధికారం కల్ల!

ఎన్ని పాదయాత్రలు చేసినా అంతే

పాలేరులా పని చేస్తే.. పొగపెట్టి పంపేశారు

జగన్ నాకు ఇచ్చిన రివార్డు ఇదే

ప్రలోభాలకు లొంగిపోయానన్నారు

జగన్ ఆ మాట వెనక్కి తీసుకోవాలి

వైసీపీ మాజీ ఎంపీ సాయిరెడ్డి ధ్వజం

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): "జగన్‌కు 15 ఏళ్లు పాలేరులాగా పని చేశాను. కానీ... కోటరీ మాటలు నమ్మి నన్ను పొగబెట్టి బయటకు పంపించడమే ఆయన నాకు ఇచ్చిన రివార్డు. ఒక పాలేరులాగా పనిచేసి నేను పండించినదంతా కోటరీలో ఉన్నవాళ్లు తిన్నారు. ఇప్పటికీ తింటూనే ఉన్నారు. జగన్ కూడా చూస్తూనే ఉన్నారు. ఈ కోటరీని నమ్ముకున్నంత కాలం జగన్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు. ఎన్ని పాదయాత్రలు చేసినా కూడా అవకాశం లేదు" అని వైసీపీ మాజీ నేత విజయ సాయిరెడ్డి పేర్కొన్నారు. తాను ప్రలోభాలకు

మిగతా IVవ పేజీలో...



ఔను.. వంద కోట్లు ఇప్పించా!

మిథున్ రెడ్డి సలహా మేరకు అరబిందో నుంచి రాజ్ కసిరెడ్డికి 100 కోట్ల రూపాయలు అరేంజ్ చేశారా అని ఈడీ అధికారులు అడిగారు. అవును.. మిథున్ రెడ్డి కోరిక మేరకు నేను రికమెండ్ చేసిన మాట వాస్తవమే.. అని చెప్పాను. మిథున్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డికి అరబిందో నుంచి ఆ డబ్బు అప్పుగా ఇప్పించాను. ఇది జగన్‌కు తెలిసే జరిగిందా, 100 కోట్లు అరేంజ్ చేయమని జగన్ మీకు చెప్పారా.. అని కూడా ప్రశ్నించారు. అయితే, జగన్ నాకు చెప్పలేదని స్పష్టం చేశాను. లిక్కర్ స్కామ్‌కు కర్త, కర్మ, క్రియ రాజ్ కసిరెడ్డి... ఆయనే దీని గురించి చెప్పగలరని ఈడీకి తెలిపాను. ఒక వేళ లిక్కర్ స్కామ్ అనేదే ఉంటే... అది కచ్చితంగా జగన్‌కు తెలిసి జరిగి ఉండదని చెప్పాను.

- మీడియాతో విజయ సాయిరెడ్డి



గురువారం టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి టి.జి.భరత్, సంస్థ ప్రతినిధులు

వేగం పెంచండి

టాటా ప్రాజెక్టులపై 'టాటా సన్స్' చైర్మన్‌కు సీఎం వినతి

దావోస్‌లో చంద్రశేఖరన్‌తో మర్యాదపూర్వక భేటీ

వీలైనంత త్వరగా పూర్తిచేస్తామన్న చైర్మన్

ఇన్నోవేషన్ హబ్ కార్యక్రమాల నిర్వహణకు టాటా ట్రస్టు నుంచి అధికారులను పంపిస్తాం

టూరిజం ప్రాజెక్టులనూ వేగవంతం చేస్తాం

స్పోర్ట్స్ సిటీల్లో పెట్టుబడులకూ చంద్రశేఖరన్ సానుకూలత

గత ఏడాది దావోస్ పర్యటనతో ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయ్

తాజా పర్యటనతోనూ సత్ఫలితాలే: చంద్రబాబు

4 రోజుల పర్యటన ముగించుకుని వెనక్కి

నేటి ఉదయం 10 గంటలకు అమరావతికి

11 గంటల నుంచి సచివాలయంలో అధికార కార్యక్రమాలకు హాజరు

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్న టాటా ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను కోరారు. దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి గురువారం ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, కర్నూలులో తలపెట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టుల పురోగతిపై చర్చ జరిగింది. వీటిని వీలైనంత వేగంగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని చంద్రశేఖరన్ తెలిపారు. అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా చేపట్టే కార్యక్రమాల నిర్వహణకు టాటా ట్రస్టు నుంచి ప్రత్యేకంగా అధికారులను పంపిస్తామన్నారు. రాష్ట్రంలో టాటా గ్రూపు చేపట్టిన టూరిజం ప్రాజెక్టులనూ వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడు స్పోర్ట్స్ సిటీలు నిర్మించే ఆలోచనలో ఉన్నామని.. ఈ రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం కోరగా చంద్రశేఖరన్

మిగతా 6వ పేజీలో...



దావోస్‌లో లోకేశ్‌కు శాలువా కప్పి జ్ఞాపికను అందజేస్తున్న టీ-సీఎం రేవంత్‌రెడ్డి

పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి

దావోస్‌లో రేవంత్‌రెడ్డి, లోకేశ్ స్నేహపూర్వక భేటీ

తెలంగాణ స్కిల్ క్యాంపస్‌లను సందర్శించాలని కోరిన తెలంగాణ సీఎం

ఏపీ విద్యా సంస్కరణలను వివరించిన లోకేశ్

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా గురువారం వారిద్దరూ స్నేహపూర్వకంగా సమావేశమయ్యారు. రేవంత్‌రెడ్డిని మంగళగిరి శాలువాతో లోకేశ్ సత్కరించి.. జ్ఞాపికను అందజేశారు. తెలంగాణ సీఎం కూడా లోకేశ్‌ను

మిగతా 6వ పేజీలో...

ఘోరాలు చేసి నీతులు!

రీ సర్వే 'ఘన కార్యాల'పై జగన్ గొప్పలు



సమగ్ర సర్వే పేరిట రాష్ట్రమంతా భూ విలయం

6,680 గ్రామాల్లో 8.75 లక్షల మందికి సమస్యలు

తాను మహాయజ్ఞం చేసినట్లుగా నేడు కలరింగ్

పైగా బాబుకు ఏమీ తెలియదని ఎద్దేవా

'రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతో భూముల సమగ్ర సర్వే మహాయజ్ఞంలా చేశాను. రీ సర్వే తర్వాత రైతులకు భూ వివాదాలు ఉండకూడదని, శాశ్వత హక్కు పత్రాలు ఇవ్వాలని యజ్ఞంలా కష్టపడ్డాను' అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత భజన చేసుకున్నారు. అసలు విషయం ఏమిటంటే... ఆయన 'యజ్ఞం' ఫలితాన్ని 8.75 లక్షల మంది రైతులు అనుభవిస్తున్నారు. జీవితానికి సరిపడా సమస్యలు తలకు చుట్టడంతో వారంతా సతమతమవుతున్నారు. అయినా సరే... గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'రీ సర్వే' గురించి గొప్పలకు పోవడం జగన్‌కే చెల్లింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భూముల రీసర్వే పేరుతో జరిగిందేమిటి? అది సమస్యలను పరిష్కరించడమా? కొత్త సమస్యలను సృష్టించడమా? జగన్ చెప్పుకొంటున్నట్లు అవి గొప్పలా? రైతులకు మిగిల్చిన తిప్పలా? ఆయన హయాంలో రీసర్వే జరిగిన 6680 గ్రామాల్లో ఏ రైతును అడిగినా ఈ ప్రశ్నకు సమాధానం చెబుతారు. అప్పుడు జగన్ కారణంగా తలెత్తిన సమస్యలను కూటమి సర్కారు కూడా పరిష్కరించలేకపోతోంది. రీ సర్వే కారణంగా కొత్త సమస్యలు తలెత్తాయని ఏకంగా 8,75,986 మంది పిటిషన్లు సమర్పించారు. రీసర్వేకు ముందు రాష్ట్రంలో ప్రతి గ్రామంలో సగటున ఐదారుగురు రైతులకు భూ వివాదాలు ఉండేవి. ఆ తర్వాత... సగటున ఒక్కో గ్రామంలో 100 మంది రైతులకు

మిగతా 6వ పేజీలో...



నంద్యాల జిల్లా శిరివెళ్ల మెట్ట వద్ద మంటల్లో కాలిపోతున్న ప్రైవేట్ స్లీపర్ బస్సు, కంటైనర్

హైవేపై అగ్ని కీలలు

అర్ధరాత్రి హైవేపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

టైరు పేలి.. డివైడర్ దాటి కంటైనర్‌ను ఢీ.. రెండూ బుగ్గి

ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం.. గాయాలతో మరొకరు మృతి

అప్రమత్తమై ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన బస్సు అటెండర్

నంద్యాల/శిరివెళ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతై 19 మంది సజీవదహనమయ్యారు. ఆ భయానక ఘటనను మరువక ముందే నంద్యాల జిల్లాలో జరిగిన మరో ఘటన తీవ్ర అలజడి రేపింది. నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను దాటి రోడ్డుకు

మిగతా 5వ పేజీలో...

త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో

పవన్ కల్యాణ్

కొత్తపాలెం-కోటప్పకొండ రోడ్డుకు ప్రారంభోత్సవం

శివరాత్రికి ముందే నిర్మాణం.. తీరనున్న భక్తుల కష్టాలు

గిరిప్రదక్షిణ రోడ్డు పూర్తి చేయాలని ఆదేశం

కోటప్పకొండను సందర్శించిన డిప్యూటీ సీఎం

హెలిప్యాడ్ నుంచి ఆలయం వరకు ఘన స్వాగతం

4



త్రికోటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

మీడియాకు పోలీసుల బ్రీఫింగ్‌పై
నియంత్రణ అవసరం: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 22: క్రిమినల్ కేసులకు సంబంధించి పోలీసు అధికారులు మీడియాకు సమాచారం తెలియజేసే అంశంలో నిర్దిష్ట విధానాలు రూపొందించి నోటిఫై చేయాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలనూ ఆదేశించింది. గోప్యతను కాపాడి.. మీడియా ట్రయల్స్‌ను నివారించేందుకు 3 నెలల్లో ఈ పాలసీలను రూపొందించాలని జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం తాజాగా స్పష్టంచేసింది. దర్యాప్తు సమయాల్లో పోలీసులు మీడియా సమావేశాల్లో సమాచారమివ్వడాన్ని నియంత్రించే విషయంలో చిత్తశుద్ధి లోపించిందంటూ అసంతృప్తి వ్యక్తంచేసింది. రాష్ట్రాలు తమ పాలసీలు తయారుచేసుకునేటప్పుడు ఈ వ్యవహారంలో కోర్టుకు సహాయకారి (అమికస్ క్యూరీ)గా ఉన్న సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ రూపొందించిన 'పోలీసు మాన్యువల్ ఆన్ మీడియా బ్రీఫింగ్'ను పరిశీలనలోకి తీసుకోవాలని సూచించింది. పోలీసు ఎన్‌కౌంటర్లు, పోలీసు అధికారుల మీడియా సమావేశాలకు సంబంధించి నిర్దిష్ట విధానాలు లేవంటూ పౌర హక్కుల సంఘం (పీయూసీఎల్) 1999లో దాఖలుచేసిన పిల్‌పై ధర్మాసనం ఈ నెల 15న జారీచేసిన ఉత్తర్వులు బుధవారం విడుదలయ్యాయి. వీటి ప్రతి అందుకున్న 3 నెలల్లోగా పాలసీ రూపొందించాలని నిర్దేశించింది.

ఐదు తప్పులు దాటితే 'లైసెన్స్' రద్దే

» సిగ్నల్ దాటినా, హెల్మెట్ లేకపోయినా శిక్ష తప్పదు

» జనవరి 1 నుంచే అమల్లోకి కొత్త నిబంధన

న్యూఢిల్లీ, జనవరి 22: రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మోటారు వాహనాల చట్టంలో సరికొత్త మార్పులను తీసుకొచ్చింది. తరచూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే డ్రైవర్లు ఇక ఎంతమాత్రం శిక్ష నుంచి తప్పించుకోలేరు. చిన్న తప్పయినా ఏడాదిలో ఐదుసార్లు జరిగితే మూడు నెలలపాటు డ్రైవింగ్ లైసెన్స్ నిలిపివేస్తారు. ప్రాంతీయ రవాణా లేదా జిల్లా రవాణా అధికారికి సదరు డ్రైవర్ లైసెన్స్ రద్దు చేయడానికి లేదా నిలిపివేయడానికి కొత్తచట్టం ప్రకారం అధికారం ఉంటుంది. జనవరి 1 నుంచి నిశ్శబ్దంగా ఈ నిబంధన అమల్లోకి వచ్చేసింది. గతంలో శిక్షార్హమైన పెద్ద నేరాలకు మాత్రమే.. వాహన దొంగతనం, ప్రయాణికులపై దాడి, కిడ్నాప్, అధిక వేగం, ఓవర్ లోడ్, బహిరంగ ప్రదేశాల్లో వాహనాన్ని వదిలేయడం వంటి వాటికి మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు వంటి శిక్ష ఉండేది. తాజా చట్ట సవరణతో హెల్మెట్ లేకపోవడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, రెడ్ లైట్‌ను పట్టించుకోకుండా కదలడం వంటి తప్పులకు కూడా లైసెన్స్ రద్దు చేయవచ్చు. కేంద్ర మోటారు వాహన నిబంధనలు రెండవ సవరణ, 2026 ప్రకారం టోల్ ఫీజు బకాయి ఉంటే ఆ వాహనం అమ్మకానికి, అంతర్రాష్ట్ర బదిలీకి ఎన్‌వోసీ జారీ చేయరు.

28 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జనవరి 22: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు త్వరలో ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ నెల 27న అఖిలపక్ష సమావేశం జరగనుంది. పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరన్ రిజిజు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో పార్లమెంటు ఉభయసభల సభ్యులు పాల్గొంటారు. ఈ భేటీలో ఎజెండా ఖరారు చేయడంతోపాటు పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సజావుగాసాగేలా సహకరించాలని అన్ని పార్టీలను సర్కారు కోరనుంది. తొలి విడత పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగుస్తాయి. తిరిగి మార్చి 9న మొదలై ఏప్రిల్ 2న ముగుస్తాయి. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి1న పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్నారు.

విజయ్ పార్టీ గుర్తు 'విజిల్'.. కేటాయించిన ఈసీ

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం 'విజిల్' చిహ్నం కేటాయించింది. ప్రతిపాదించిన పది చిహ్నాలలో విజయ్ కోరుకున్నట్లుగానే విజిల్‌ను ఈసీ కేటాయించింది. విజిల్‌కు విజయ్‌కు అవినాభావ సంబంధముందని ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ చిత్రం 'గోట్‌'లో ఉన్న 'విజిల్ పోడు' (విజిల్ ఊదు) అనే పాట ఎంతో పాపులర్ అయింది. ఆయన నటించిన 'బిగిల్' (విజిల్) అనే చిత్రం కూడా సూపర్ హిట్టయింది. చిహ్నం కేటాయింపుపై పార్టీ సంయుక్త కార్యదర్శి నిర్మల్‌కుమార్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ గుర్తుపై ఇప్పటికే పార్టీ నేతలు ప్రజల్లో అవగాహన కల్పించారని పేర్కొన్నారు.

సభలో ఉన్నది రెండు నిమిషాలే!

» ప్రసంగ పాఠం చదవకుండానే కర్ణాటక గవర్నర్ నిష్క్రమణ

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక అసెంబ్లీ సమావేశాలు 'ప్రభుత్వం వర్సెస్ గవర్నర్' అన్నట్లుగా మొదలయ్యాయి. శాసనసభ సమావేశాలలో గవర్నర్ పాల్గొంటారా లేదా అనే ఉత్కంఠ గురువారం చివరిక్షణం దాకా కొనసాగింది. నిర్దేశించిన సమయం 11 గంటలకు లోక్‌భవన్ నుంచి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ బయలుదేరి, విధానసౌధ ప్రాంగణానికి చేరుకున్నారు. సీఎం సిద్దరామయ్య, స్పీకర్ తదితరులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. సభలో గవర్నర్ అందరికీ అభివాదం చేసుకుంటూ స్పీకర్ స్థానానికి చేరుకున్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రసంగ పుస్తకంలోని మొదటి పేజీ తొలి పేరాలో ఉండే 'పరిషత్ సభాపతి, శాసనసభ స్పీకర్, గౌరవ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత, ఉభయ సభల సభ్యులందరికీ హృదయపూర్వక స్వాగతం' అని చదివారు. తర్వాత ప్రసంగాన్ని పూర్తిగా వదిలేశారు. 122 సబ్జెక్టులలో 46వ పేజీలో చివర ఉన్న 'జై హింద్, జై కర్ణాటక' అని ముగించారు. సభలో గవర్నర్ కేవలం రెండు నిమిషాలు గడిపారు. ఆ తర్వాత వెళ్లిపోతుండగా కాంగ్రెస్ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో తోపులాట జరిగింది. మార్షల్స్ భద్రత మధ్య గవర్నర్ అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లారు. సభా సంప్రదాయం ప్రకారం గవర్నర్ జాతీయ గీతాన్ని ఆలపించలేదని కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. గవర్నర్‌ను అడ్డుకుని, సభా నిబంధనలను ఉల్లంఘించారని బీజేపీ, జేడీఎస్ సభ్యులు విరుచుకుపడ్డారు. కాగా, తోపులాటలో కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ చొక్కా వెనుకభాగాన చిరిగిపోయింది. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ', మరికొన్ని అంశాలను గవర్నర్ చదవాల్సిన పుస్తకంలో రెండో పేజీలో పొందుపరిచారు. దీంతో గవర్నర్ చదవడం ప్రారంభిస్తే, వెంటనే ఆ అంశాలను ప్రస్తావించాల్సి వచ్చేది. అందుకే ఏ ఒక్క అంశాన్నీ చదవకుండా ఆయన వెళ్లిపోయారు.

'గవర్నర్ ప్రసంగం' సాంప్రదాయానికి స్వస్తి చెప్పాలి: స్టాలిన్

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని అసెంబ్లీలో చదివేందుకు నిరాకరించిన తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల గవర్నర్ల వ్యవహారశైలి పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించే పద్ధతికి ముగింపు పలకడమే దీనికి ఏకైక పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు.

అణు పరీక్షలతో మారణహోమం..!

» 1945-2017 మధ్య 40 లక్షల మంది మృత్యువాత

» నార్వేజియన్ పీపుల్స్ ఎయిడ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రపంచంలో దేశాల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా జరుగుతున్న అణు పరీక్షలు కంటికి కనిపించని మారణహోమాన్ని సృష్టిస్తున్నాయి..! వివిధ దేశాలు తమ సైనిక శక్తిని పెంచుకోవడానికి నిర్వహిస్తున్న అణ్వాయుధ పరీక్షల వల్ల లక్షలాది మంది మృత్యువాత పడ్డారని తాజా నివేదిక వెల్లడించింది. 1945 నుంచి 2017 మధ్యకాలంలో వివిధ దేశాలు చేపట్టిన 2,400 అణుపరీక్షల వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమా రు 40 లక్షల మంది అకాల మరణం చెందినట్టు నార్వేజియన్ పీపుల్స్ ఎయిడ్ నివేదిక అంచనా వేసింది. ఈ మరణాలకు ప్రధాన కారణం రేడియో ధార్మికత అని ఈ నివేదిక తెలిపింది. రేడియేషన్ ప్రభావం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు వంటి వ్యాధులు ఎక్కువయ్యాయని, దీని ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవలి దశాబ్దాల్లో ఉత్తర కొరియా మాత్రమే అణు పరీక్షలు నిర్వహించినప్పటికీ.. వీటితోపాటు వివిధ దేశాల గత పరీక్షల వల్ల ఏర్పడిన రేడియోధార్మికత.. ప్రజల ఆరోగ్యంపై నేటికీ ప్రభావం చూపిస్తోందని పేర్కొంది. గాలి, నేల, నీటిని కలుషితం చేసే అణు పరీక్షల వల్ల పర్యావరణంతోపాటు ప్రజారోగ్యానికీ నష్టం కలుగుతోందని తెలిపింది.

సుంకాలపై వెనక్కి తగ్గిన ట్రంప్

గ్రీన్‌లాండ్ విషయంలో యూరప్ దేశాలపై సుంకాలుండవని ప్రకటన

» ఆర్కిటిక్ విషయంలో నాటోతో డీల్ కుదిరిందని వెల్లడి

» అట్లాంటిక్ ప్రాంతంపై కొత్త చార్టర్ కోసం యూరప్ దేశాల భేటీ

దావోస్/కోపెన్‌హెగెన్, జనవరి 22: గ్రీన్‌లాండ్ విషయంలో తన మాట వినని 8 యూరప్ దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తానని బెదిరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఎట్టకేలకు వెనక్కు తగ్గారు. ఇకపై అదనపు సుంకాల విధింపు ఉండబోదని బుధవారం సోషల్‌మీడియా వేదికగా ప్రకటించారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మాట్లాడిన అనంతరం సీఎన్‌బీసీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మరో కొత్త విషయం చెప్పారు. ఆర్కిటిక్ ప్రాంత రక్షణ, ఉద్రిక్తతల నివారణ కోసం 'భవిష్యత్తులో చేసుకోబోయే ఒప్పందం' కోసం విధివిధానాలను రూపొందించే విషయంలో నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) కార్యదర్శి జనరల్ మార్క్ రుట్టేతో డీల్ కుదిరిందని వెల్లడించారు. అయితే ఆ డీల్ వివరాలు మాత్రం బయటపెట్టలేదు. మరోవైపు 175 బిలియన్ డాలర్ల వ్యయంతో అమెరికాలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న గగనతల రక్షణ వ్యవస్థ గోల్డెన్ డోమ్ మిసైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌ను గ్రీన్‌లాండ్‌కు కూడా విస్తరించే అంశంలో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. దావోస్‌లో ఆయన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జెలెన్‌స్కీతో భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగిందని తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను తమ అధికారులు నేడో రేపో కలుస్తారని చెప్పారు.

మా సార్వభౌమత్వంపై బేరసారాలు ఉండవు: డెన్మార్క్

గ్రీన్‌లాండ్ విషయంలో డెన్మార్క్ తన విధానాన్ని మరోసారి స్పష్టంచేసింది. తమ దేశ సార్వభౌమత్వంపై ఎవరితోనూ బేరసారాలు నిర్వహించబోమని ఆ దేశ ప్రధాని మెట్టీ ఫ్రెడరిక్‌సెన్ తేల్చి చెప్పారు. గురువారం ఆమె ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఆర్కిటిక్ భద్రత నాటో కూటమి మొత్తానికి సంబంధించినది. డెన్మార్క్ రాజ్యం గురించి నాటోకు పూర్తి అవగాహన ఉంది. మా దేశ భద్రత, పెట్టుబడులు, ఆర్థిక అంశాలపై చర్చలకు మేము ఎల్లప్పుడూ సిద్ధమే. సార్వభౌమత్వం విషయంలో మాత్రాం బేరసారాలు నిర్వహించలేం' అని స్పష్టంచేశారు. మరోవైపు ట్రంప్ విధానాలతో చికాకు పడిన యూరప్ దేశాలు మరింతగా ఏకమవుతున్నాయి. అట్లాంటిక్ ప్రాంతంలో భవిష్యత్తులో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా చూసే కొత్త చార్టర్ (ఒప్పందం) రూపకల్పనకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) కూటమిలోని దేశాల అధినేతలు గురువారం అత్యవసరంగా సమావేశమయ్యారు. కాగా, గ్రీన్‌లాండ్ వివాదంపై పుతిన్ స్పందించారు. బుధవారం రాత్రి నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రీన్‌లాండ్ వివాదం రష్యాకు సంబంధం లేనిదని తేల్చి చెప్పారు.



శాంతి మండలిలో చేరిన దేశాల జాబితాను చూపుతున్న ట్రంప్

శాంతి మండలిని ప్రారంభించిన ట్రంప్


» గాజాలో శాంతి సాధన తర్వాత ఈ బోర్డును ఇతర విషయాలకూ వర్తింపజేస్తామని వ్యాఖ్య

» పాకిస్థాన్ సహా 20కిపైగా దేశాల సంతకాలు

» ఈ కార్యక్రమానికి హాజరు కాని భారతదేశం

దావోస్, జనవరి 22: గాజాలో శాంతి కోసం తాను ప్రతిపాదించిన 'శాంతి మండలి(బోర్డ్ ఆఫ్ పీస్)'ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం దావోస్‌లో ప్రారంభించారు. అందులో అన్ని దేశాలూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారుగానీ.. అమెరికా మిత్రదేశాలే చాలావరకూ అందులో భాగం కాకపోవడం గమనార్హం. భారత్ కూడా ఆ బోర్డుకు దూరంగానే ఉంది. ట్రంప్ ఆహ్వానాన్ని మన్నించి ఈ బోర్డులో చేరేందుకు 22 దేశాలు అంగీకరించాయి. వాటిలో.. పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ, యూఏఈ, ఖతార్, ఉజ్బెకిస్థాన్, ఇండోనేసియా, జోర్డాన్, కజకిస్థాన్ వంటి ముస్లిం దేశాలే ఎక్కువగా ఉండడం గమనార్హం. శాంతి బోర్డులో చేరేందుకు అంగీకారం తెలుపుతూ పలువురు దేశాధినేతలు సంతకం చేసిన అనంతరం ట్రంప్ వారిని ఉద్దేశించి.. 'మీరు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతులు' అని వ్యాఖ్యానించారు. కాగా.. ట్రంప్ వ్యవహారశైలితో తీవ్రంగా విభేదిస్తున్న ఫ్రాన్స్, నార్వే, స్లోవేనియా, స్వీడన్, యూకే ఈ బోర్డులో చేరడానికి (కనీసం ప్రస్తుతానికి) ఇష్టపడలేదు. భారత్, చైనా, రష్యా, జర్మనీ, ఇటలీ, సింగపూర్, తదితర దేశాలు ఇందులో చేరుతామనిగానీ, చేరబోమని గానీ చెప్పలేదు.

లోకం తీరు



వెనెజువెలాపై దాడిలో సానిక్ ఆయుధాల వినియోగం!

» పరోక్షంగా ధ్రువీకరించిన ట్రంప్

వాషింగ్టన్, జనవరి 22: వెనెజువెలాపై దాడి సమయంలో అమెరికా సైనికులు.. రహస్య సానిక్ ఆయుధాలను వినియోగించినట్లుగా ఇప్పటివరకూ వ్యక్తమైన సందేహాలను ట్రంప్ పరోక్షంగా ధ్రువీకరించారు. ఇటీవల ఓ టీవీ చానల్‌లో ప్రసారమైన ఇంటర్వ్యూలో యాంకర్.. సానిక్ ఆయుధాల్ని ఉపయోగించిన మాట వాస్తవమేనా అని ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి ట్రంప్ బదులిస్తూ.. 'ఎవరికీ తెలియని ఆయుధాలు మనవద్ద ఉన్నాయి. వాటి గురించి మాట్లాడుకోకపోవటమే మంచిది. కానీ, అవి అద్భుతమైన ఆయుధాలు. అది ఓ గొప్ప దాడి' అని పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన వెనెజువెలా రాజధాని కారకాస్‌పై అమెరికా సైనికులు జరిపిన దాడిలో 83 మంది మరణించారు. వీరిలో వెనెజువెలాకు చెందిన 47 మంది సైనికులు, ఆ దేశానికి రక్షణ కల్పించటానికి వచ్చిన క్యూబా సైనికులు 32 మంది ఉన్నారు. మిగిలినవారు సాధారణ పౌరులు. ఈ దాడిలో గాయపడిన ఓ వెనెజువెలా సైనికుడి ఇంటర్వ్యూ అప్పట్లో బయటకు వచ్చింది. దానిని అమెరికా వైట్‌హౌస్ కార్యదర్శి కూడా సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'అకస్మాత్తుగా ఏదో వచ్చి పడింది. అది అత్యంత తీవ్రమైన ధ్వని తరంగంలా ఉంది. తల లోపలి నుంచి పగిలిపోతున్నట్లు అనిపించింది. అక్కడున్న మాకందరికీ ముక్కు లోంచి రక్తం కారటం మొదలైంది. కొందరు రక్తం కక్కుకున్నారు. మేం నేల మీద పడి అచేతనంగా ఉండిపోయాం' అని ఆ వీడియోలో సదరు సైనికుడు చెప్పటం కనిపించింది. అమెరికా సైనికులు తమ వెంట బందీగా తీసుకెళ్లిన వెనెజువెలా అధ్యక్షుడు మదురో షర్టుపైన రక్తపు మరకలు ఉండటం కూడా అప్పట్లో వెలువడిన ఫొటోల్లో కనిపించిన విషయం తెలిసిందే. ఆయన మీద కూడా ఈ తరహా ఆయుధమే ప్రయోగించి ఉంటారని ఇప్పుడు తెలుస్తోంది.

కొత్తగా 25 బీ2 బాంబర్ల తయారీకి ఆర్డర్ ఇచ్చాం!

» దావోస్‌లో ట్రంప్ ప్రకటన

» ఆ విమానాల తయారీ ఆగిపోయింది

» ట్రంప్ చెబుతున్నది 'బీ21 రైడర్ల' గురించి అయి ఉండొచ్చంటున్న నిపుణులు

దావోస్, జనవరి 22: అమెరికా స్టెల్త్ బాంబర్ల సంఖ్యను రెట్టింపు చేయడానికి తాము కొత్తగా 25 బీ2 బాంబర్ల తయారీకి ఆర్డర్ ఇచ్చినట్టు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం దావోస్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన.. గత ఏడాది జూన్‌లో ఇరాన్‌లోని అణు స్థావరాలనే లక్ష్యంగా చేసుకుని 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరిట బీ2 బాంబర్లతో తాము చేసిన దాడి గురించి ప్రస్తావించారు. అప్పట్లో ఆ విమానాలు తెల్లవారుజామున 2 గంటల సమయంలో చిమ్మచీకటిలో ఇరాన్‌లోకి ప్రవేశించి దాడి చేశాయని గుర్తుచేశారు. ప్రస్తుతం అమెరికా వద్ద 19 బీ2 బాంబర్లు సర్వీసులో ఉన్నాయి. వాటికి తోడుగా మరో 25 బాంబర్లను ఆర్డర్ చేశామని ట్రంప్ చెబుతున్నారు. కానీ.. అమెరికా బీ2 స్పిరిట్ బాంబర్ల తయారీని రెండు దశాబ్దాల క్రితమే నిలిపివేసిందని, దాన్ని తిరిగి ప్రారంభించడం అసాధ్యమని రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే బీ2 అసెంబ్లీ లైన్‌ను మళ్లీ ఏర్పాటు చేయాలంటే పూర్తిగా కొత్తగా మొదలుపెట్టాల్సి ఉంటుంది. వాటి ఫ్లయింగ్ వింగ్ నిర్మాణానికి ఉపయోగించిన భారీ కాంపోజిట్ మౌల్డులను మళ్లీ తయారుచేయాలంటే కొన్నేళ్లు పడుతుంది. కాబట్టి.. బహుశా ట్రంప్ చెబుతున్నది బీ2 బాంబర్ల స్థానంలో అభివృద్ధి చేస్తున్న బీ21 రైడర్ల గురించి అని.. రెండింటికీ తేడా తెలియకపోవడం వల్లే ఆయన అలా చెప్పి ఉంటారని నిపుణులు పేర్కొంటున్నారు.



లోయలో పడిన ఆర్మీ వాహనం

10 మంది సైనికుల మృతి

» మరో 11 మందికి తీవ్ర గాయాలు

» కశ్మీర్‌లోని దోడా జిల్లాలో దుర్ఘటన

జమ్మూ/భదేర్వాహ్, జనవరి 22: జమ్మూ కశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 21మంది జవాన్లు ప్రయాణిస్తున్న ఆర్మీ బుల్లెట్ ప్రూఫ్ వాహనం 'కాస్పిర్' అదుపు తప్పి 200 అడుగుల లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మిగతా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. జవాన్లు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌కు వెళుతుండగా భదేర్వాహ్-చంబా అంతర్రాష్ట్ర రహదారి వెంబడి ఉన్న 9వేల అడుగుల ఎత్తులోని ఖన్నీ టాప్ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన సంభవించింది. విపరీతంగా మంచు కురుస్తుండడంతో రోడ్డు పైనుంచి జారిన వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో పక్కనున్న లోయలోకి పడిపోయింది. వెంటనే ఆర్మీ, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని జవాన్లను బయటకు తీసుకొచ్చారు. నలుగురు జవాన్లు అక్కడికక్కడే మరణించగా.. తీవ్రం గా గాయపడిన 17 మందిని భదేర్వాహ్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఆరుగురు చికిత్స పొందుతూ మరణించారు. 10మందిని హెలికాప్టర్‌లో ఉధంపూర్ కమాండ్ ఆస్పత్రికి తరలించారు. భదేర్వాహ్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న మరో జవాను పరిస్థితి నిలకడగా ఉందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. మందుపాతరలు, ఐఈడీల పేలుడు ధాటిని సైతం తట్టుకోలిగేలా, ఆకస్మిక దాడులను ఎదుర్కొనేందుకు వీలుగా రూపొందించిన ఈ కాస్పిర్ వాహనం ప్రమాదంలో ధ్వంసమైంది. ప్రధాని మోదీ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణా లు కోల్పోయిన జవాన్ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన జవాన్లు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పది మంది సాహసవంతులైన సైనికులను కోల్పోవడం కలచివేస్తోందని, దేశానికి వారు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని మోదీ, రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

భారత్‌కు రష్యా పౌర విమానాలు!

అమెరికా బోయింగ్, యూరప్ ఎయిర్‌బస్‌లకు పోటీగా ఎస్‌జే-100, ఐఎల్-114, ఎంఎస్-21, టీయూ-214 విమానాలు

» భారత్‌లో తయారీకి వీలు కల్పించేందుకూ రష్యా సిద్ధం

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రయాణికుల విమానాలు అంటే.. అటు అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థవి లేదా ఇటు యూరప్‌కు చెందిన ఎయిర్‌బస్ సంస్థకు చెందినవే ఉంటుంటాయి. మరికొన్ని విమాన సంస్థలున్నా వీటిదే ఆధిపత్యం. దానికితోడు ప్రపంచవ్యాప్తంగా పౌర విమానాల కోసం విపరీతమైన డిమాండ్ ఉంది. విమానాలు కొనేందుకు సిద్ధంగానే ఉన్నా.. ఇప్పట్లో అందలేని పరిస్థితి. ఇలాంటి సమయంలో రష్యా తమ పౌర విమానాలను భారత్‌కు అందజేసేందుకు ముందుకొచ్చింది. 1,500 కిలోమీటర్లలోపు ప్రాంతీయ ప్రయాణాలకు సరిపోయే సుఖోయ్ జెట్ (ఎస్‌జే)-100, ఇల్యూషనోవ్ (ఐఎల్)-114.. మూడు వేల కిలోమీటర్ల వరకు ప్రయాణించగల ఆధునిక ఎంఎస్-21, ఏకధాటిగా 6,500 కిలోమీటర్ల దూరం ప్రయాణించగల అత్యాధునిక టీయూ-214 విమానాలు ఈ జాబితాలో ఉన్నాయి ఈ విమానాలకు సంబంధించి ఇంజన్లు, ఇతర భాగాల నుంచి ఇంటీరియర్ వరకు పూర్తిగా రష్యా అభివృద్ధి చేసినవే కావడం గమనార్హం.. బోయింగ్ 757, ఎయిర్‌బస్ 321 విమానాలకు రష్యా టీయూ-214 పోటీగా నిలవనుంది. అంతేకాదు బోయింగ్, ఎయిర్‌బస్‌లతో పోలిస్తే.. ఈ విమానాల నిర్వహణ వ్యయం చాలా తక్కువని.. విమానయాన సంస్థలు తక్కువ వ్యయంతోనే సర్వీసులు నిర్వహించేందుకు వీలవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎస్‌జే-100, ఐఎల్-114 విమానాలు చిన్న రన్‌వేలపైనా సులువుగా టేకాఫ్, ల్యాండింగ్ కాగలవని అంటున్నారు.



భారత్‌లో ఉత్పత్తికి రష్యా సుముఖత!

ఎస్‌జే-100 విమానాలను భారత్‌లో ఉత్పత్తి చేసేందుకు రష్యా ఇప్పటికే సుముఖత వ్యక్తం చేసింది. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)తో కలిసి ఉమ్మడిగా తయారు చేయడంపై ఒప్పందం కుదిరింది. ఐఎల్-114, టీయూ-214 విమానాల సరఫరా, భారత్‌లో తయారు చేయడంపై చర్చలు జరుగుతున్నాయి. ఈ అంశంలో ముందడుగు పడితే.. భారత విమానయాన సంస్థలకు విమానాల కొరత తప్పడంతోపాటు మరమ్మతులు, నిర్వహణ భారం తగ్గుతుంది. భారత్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగంలో రష్యా విమానాలు కీలకంగా మారుతాయని.. ముఖ్యంగా దేశవ్యాప్తంగా విమాన సేవల విస్తరణ కోసం చేపట్టిన 'ఉడాన్' పథకానికి ఊతమిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో పౌర విమానాల తయారీలో బోయింగ్, ఎయిర్‌బస్‌ల ఆధిపత్యానికి సవాలు విసిరినట్టేనని పేర్కొంటున్నారు.

హైదరాబాద్‌తోనే ప్రపంచం ముందుకు!

హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో ఈ నెల 28వ తేదీ నుంచి 31వరకు జరగనున్న 'వింగ్స్ ఇండియా 2026' షోలో రష్యా పౌర విమానాలు ఎస్‌జే-100, ఐఎల్-114లను ప్రదర్శించనున్నారు. కేవలం విమానాల రూపాన్నే కాకుండా లోపల సీట్లు, ఇతర ఏర్పాట్లను కూడా వీక్షించే ఏర్పాట్లు చేస్తున్నారు. రష్యా ఈ విమానాలను ఆ దేశం బయట ప్రదర్శిస్తుండటం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఝార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

16 మంది మావోయిస్టుల మృతి

» మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు అనల్‌దా

» అనల్‌దాపై రూ.2.35 కోట్ల రివార్డు

చైబాసా, జనవరి 22: ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్భూమ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య గురువారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో 16 మంది మావోయిస్టులు మరణించారు. మృతుల్లో పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు పతిరామ్ మాంజీ అలియాస్ అనల్‌దాతోపాటు ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. ఈ ఎన్‌కౌంటర్ వివరాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. ఎక్స్ వేదికగా ప్రకటించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు అనల్‌దాతోపాటు 16 మంది ఇప్పటిదాకా ఎన్‌కౌంటర్‌లో మరణించారని వెల్లడించారు. మిగిలిన మావోయిస్టులు జనజీవనంలోకి రావాలని పిలుపునిచ్చారు. 1987 నుంచి మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్న అనల్‌దాపై రూ.2.35 కోట్ల రివార్డు ఉంది. అతని కోసం పోలీసులు చాలాకాలంగా గాలిస్తున్నారు. సీఆర్‌పీఎఫ్ అధికారుల కథనం ప్రకారం.. అనల్‌దా ఆచూకీపై అందిన సమాచారం మేరకు సీఆర్‌పీఎఫ్ కోబ్రా విభాగానికి చెందిన 1500 మంది సిబ్బంది సారండా అడవుల్లో మంగళవారం నుంచి గాలింపు చేపట్టారు. అయితే, గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. ఈ కాల్పుల్లో అనల్‌దా, బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ(బీజేఎస్ఏసీ) సభ్యుడు అన్మోల్ అలియాస్ సుశాంత్ సహా 16 మంది మావోయిస్టులు మరణించగా వారి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 11 మందిని గుర్తించారు. 149 కేసుల్లో నిందితుడైన అన్మోల్‌పై రూ.90లక్షల రివార్డు ఉంది. ఘటనాస్థలంలో పెద్ద సంఖ్యలో ఆయుధాలు, ఆయుధ సామగ్రిని కూడా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కాగా, మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతోందని, ఝార్ఖండ్‌లో మరో 60 నుంచి 65 మంది మావోయిస్టులు మాత్రమే మిగిలి ఉన్నారని, మిసిర్ బెస్రా మినహా కేంద్ర కమిటీ సభ్యులంతా హతమయ్యారని సీఆర్‌పీఎఫ్ ఐజీ సాకేత్ కుమార్ సింగ్ ప్రకటించారు. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలుమార్లు ప్రకటనలు చేశారు. ఈ నేపథ్యంలో 2021 నుంచి 2025 మధ్యలో ఝార్ఖండ్‌లో 250 మంది మావోయిస్టులు కాల్పుల్లో మృతి చెందగా, 11,000 మందికి పైగా అరెస్టయ్యారు.

ప్రపంచ రెండో రద్దీ నగరం బెంగళూరు

» టామ్‌టామ్ నివేదికలో వివరాలు



బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో రెండో రద్దీ నగరంగా (ట్రాఫిక్‌లో) దేశ ఐటీ రాజధాని, సిలికాన్ సిటీగా పేరొందిన బెంగళూరు నిలిచింది. అంతర్జాతీయ లోకేషన్ టెక్నాలజీ కంపెనీ టామ్‌టామ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ అంశాన్ని పేర్కొంది. 2025లో బెంగళూరు ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొనే నగరాలలో రెండో స్థానంలో నిలిచినట్టు ప్రకటించింది. అత్యంత ట్రాఫిక్ కలిగిన నగరాలలో మెక్సికో సిటీ తొలిస్థానంలో ఉండగా ఐర్లండ్‌లోని డబ్లిన్ నగరం మూడోస్థానంలో నిలిచింది. బెంగళూరులో పది కిలోమీటర్ల ప్రయాణానికి సుమారు 36 నిమిషాలు పట్టినట్టు నివేదిక పేర్కొంది. 2024తో పోల్చితే ఆ సమయం రెండు నిమిషాల నాలుగు సెకన్లు పెరిగిందని తెలిపింది. బెంగళూరులో వారంలో ఏడు రోజుల పాటూ ట్రాఫిక్ కొనసాగుతుందని పేర్కొంది. ఏడాదికి 168 గంటల పాటు కేవలం రష్ అవర్ ట్రాఫిక్‌లో ఉంటారని, రోజుల ప్రకారం లెక్కపెడితే ఒక వ్యక్తి తన జీవితంలో విలువైన 7.40 గంటలను రోడ్డుపైనే వృథాగా గడుపుతారని తెలిపింది.

ప్రతీకార రాజకీయాలెలా ఉంటాయో
మూడేళ్ల తర్వాత అర్థమవుతాయ్!

- కక్షలకు బలైన కుటుంబాలు సహనంతో ఉండవ్
- సీఎం చంద్రబాబుకు జగన్ హెచ్చరిక
- నాకు హోదా ఇస్తేనే సభకు వస్తా
- ఏడాదిన్నర పాదయాత్ర: మాజీ సీఎం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని.. జనం భయంతో ఊళ్లకు ఊళ్లు విడిచి పారిపోతున్నారని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కక్షలకు బలైన కుటుంబాలు సహనంతో ఉండరని.. ప్రతీకారం తీర్చుకుంటారని గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబును హెచ్చరించారు. ప్రతీకార రాజకీయాలు ఎలా ఉంటాయో మూడేళ్ల తర్వాత ఆయనకు అర్థమవుతుందన్నారు. పల్నాడు జిల్లా పిన్నెల్లిలో భార్యకు ఆరోగ్యం బాగోలేదని చూసేందుకు వెళ్లిన వైసీపీ కార్యకర్తను చంద్రబాబే చంపించారని.. దీనిపై త్వరలోనే జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని చెప్పారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఆయన తన సానుకూల మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు నాయకుడూ కాదు.. మంచివాడూ కాదు.. అన్నీ చెడ్డ అలవాట్లే.. అసలాయన మనిషే కాదు. కళ్లు మూసి తెరిచేలోగానే చూస్తూ ఉండగానే రెండేళ్లయిపోయాయి. మరోసారి కళ్లు మూసి తెరిచేలోగా మూడేళ్లయిపోతాయి. అప్పుడు చంద్రబాబుకు ఆయన నాటిన విషపు విత్తనాలు మహావృక్షాలైతే ఎలా ఉంటుందో తెలుస్తుంది. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉంది. అవినీతి పాలన సాగుతోంది. వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయి. ఎక్కడ చూసినా బెల్టు షాపులు, ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇసుక నుంచి మట్టి, క్వార్ట్జ్ దాకా అన్ని ఖనిజాలూ దోచుకుంటున్నారు. సంక్రాంతి సమయంలో జూదాన్ని నివారించాల్సిన ముఖ్యమంత్రి దగ్గరుండి జూదాన్ని ప్రోత్సహించారు. ఎమ్మెల్యేల నుంచి డీఐజీ, సీఐ, ఎస్సై దాకా పోలీసులే గ్యాంబ్లింగ్ నడిపించారు' అని విమర్శించారు. శాసనసభలో వైసీపీ మాత్రమే ప్రతిపక్షమని అందరికీ తెలుసని.. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా స్పీకర్‌ను ఏ శక్తి ఆపుతోందని ప్రశ్నించారు. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తానని పునరుద్ఘాటించారు. దీనిపై 'నో వర్క్ నో పే'



అని స్పీకర్ మాట్లాడడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనన్నారు. ఏడాదిన్నర తర్వాత తాను ప్రజల్లోనే ఉంటానని.. ఏడాదిన్నరపాటు పాదయాత్ర చేస్తానని చెప్పారు. పీపీపీ విధానంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి, యాజమాన్య నిర్వహణకు ముందుకు వచ్చేవారిని.. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే జైలుకు పంపుతామని హెచ్చరించారు. తన హయాంలోనే సమగ్ర భూ సర్వే యజ్ఞం చేశానని.. అంతకుముందు చంద్రబాబుకు ఎప్పుడూ భూరికార్డులను సరిచేయాలని.. సమగ్ర సర్వే చేయాలన్న ఆలోచనే రాలేదన్నారు. భూసర్వేపైనా ఆయన క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నాడని విమర్శించారు. అమరావతి నిర్మాణ వ్యయాన్ని పెంచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో నిర్మాణ వ్యయం చఅడుగుకు రూ.4,500 కాగా.. ఇక్కడ రూ.11 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచుతున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు అనుకూలంగా ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పనంగా భూములివ్వడమే గాక.. ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నారని విమర్శించారు.

ఉక్కులో 12 గంటల డ్యూటీ!

- ఉత్పత్తి లక్ష్యం పేరుతో ఉత్తర్వులు
- కోక్ ఓవెన్ విభాగంలో అసిస్టెంట్ మేనేజర్ నుంచి డిప్యూటీ జనరల్ మేనేజర్ వరకూ... మొత్తం 99 మందికి వర్తింపు

విశాఖపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు యాజమాన్యం 'ఉత్పత్తి లక్ష్యం' అంటూ గురువారం రాత్రి ఎమర్జెన్సీ డ్యూటీ ఆదేశాలను జారీ చేసింది. మొన్నటి వరకూ బ్లాస్ట్ ఫర్నేస్‌ల నుంచి రోజుకు 19 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయాలని లక్ష్యం విధించారు. అలా చేయకపోతే వేతనాల్లో కోత పెడతామని హెచ్చరించి, దానిని అమలు చేశారు. దాంతో కార్మికులంతా శ్రమించి అంతకు మించి ఉత్పత్తి చేశారు. ఇప్పుడు కోక్ ఓవెన్ విభాగం వంతు వచ్చింది. అనుకున్న మేరకు ఉక్కు ఉత్పత్తి జరగాలంటే కోక్‌ఓవెన్‌లో మూడు బ్యాటరీల ద్వారా రోజుకు 400 పుషింగ్‌లు చేయాలి. కానీ ప్రస్తుతం రోజుకు 320-330 మాత్రమే వస్తున్నాయి. ప్లాంటులోని కోక్ ఓవెన్ బ్యాటరీల జీవితకాలం దాదాపుగా అయిపోవచ్చింది. వాటితో 100 శాతం పుషింగ్‌లు చేయాలంటే కష్టమని ఉద్యోగ వర్గాలు వాపోతున్నాయి. అసిస్టెంట్ మేనేజర్ నుంచి డిప్యూటీ జనరల్ మేనేజర్ వరకూ మొత్తం 99 మందికి ఈ డ్యూటీలు వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పారిశ్రామిక ప్రగతిపై
శ్వేతపత్రం విడుదల చేయాలి

- పరిశ్రమలకు ఇష్టానుసారం భూ కేటాయింపులు సరికాదు: సీపీఐ

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య, ఏపీ కంట్రోల్ మిషన్ ఛైర్మన్ జల్లి విల్సన్ తదితరులతో కలసి ఆయన గురువారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండేళ్లలో పారిశ్రామిక అవసరాల కోసం ఎన్ని లక్షల ఎకరాలు సమీకరించారు? ఎన్ని వేల ఎకరాలు కార్పొరేట్ సంస్థలకు అప్పగించారు? ఆ కార్పొరేట్ కంపెనీలు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాయి? ఎంత ఉత్పత్తి పెరిగింది? తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు, ఆదాయం ఎంత పెరిగింది? అనే వివరాలను ప్రభుత్వం శ్వేతపత్రంలో వెల్లడించాలి. పరిశ్రమలు నెలకొల్పే సంస్థలకు 99 పైసలకే భూములు ఇస్తామని మంత్రి లోకేశ్ మాట్లాడుతుండటం సరికాదు. ఎవరి భూములు ఎవరికి దానం చేస్తున్నారు? పారిశ్రామిక వర్గాలకు ఇష్టానుసారంగా భూములు ఇవ్వడానికి రాష్ట్రం ఎవరి జాగీరు కాదనే విషయాన్ని లోకేశ్ గుర్తు పెట్టుకోవాలి. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు పీపీపీ గురించి గొప్పగా చెబుతున్నారు. ఈ విధానం ప్రపంచంలో ఎక్కడా విజయవంతం కాలేదు. రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని సీఎం ప్రకటించడం సరికాదు' అని ఈశ్వరయ్య పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పబ్లిక్ రంగాన్ని టోకుగా ప్రైవేటీకరిస్తున్నాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జాతా నిర్వహించాలని నిర్ణయించింది' అని తెలిపారు.

సచివాలయ సిబ్బందితో గ్రేడ్ 3 ఈవో పోస్టుల భర్తీ

- దేవదాయ శాఖకు ప్రభుత్వ ఆదేశం
- గ్రేడ్ 1 పోస్టుల భర్తీకి నో
- నిరుద్యోగుల ఆశలపై నీళ్లు..!

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ, వార్డు సచివాలయల్లో అదనంగా ఉన్న ఉద్యోగులను దేవదాయ శాఖ గ్రేడ్-3 ఈవో స్థానాల్లో నియమించుకునే అవకాశం కల్పించింది. గ్రేడ్-3 ఈవో పోస్టులు 104, గ్రేడ్-1 ఈవో పోస్టులు ఐదు భర్తీ చేయడానికి అనుమతివ్వాలని దేవదాయ శాఖ కమిషనర్ ప్రభుత్వాన్ని కోరారు. పరిశీలించిన ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ 5, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ మాత్రమే చేపట్టనుంది. గ్రేడ్-1, గ్రేడ్-3 ఈవో పోస్టుల భర్తీపై కీలక నిర్ణయం తీసుకుంది. దేవదాయ శాఖలో ప్రభుత్వం కేటాయించిన కోటా కంటే గ్రేడ్-1లు అధికంగా ఉన్నారని గుర్తించిన ప్రభుత్వం ఆ నియామకాలకు అనుమతులు ఇవ్వలేదు. గ్రేడ్-3 ఈవో పోస్టులను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో భర్తీ చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్ ఆఫిషియో కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ ఒక మెమో జారీ చేశారు. కాగా, ఇప్పటికే ఏపీపీఎస్సీ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న నియామకాలు చాలా తక్కువగా ఉన్నాయి. దేవదాయ శాఖ గ్రేడ్ - 3 ఈవో పోస్టులపై నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అధికారులు వారి ఆశలపై నీళ్లు చల్లారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ఆ పోస్టులను కూడా ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


తనను కలిసిన కానిస్టేబుల్ జయశాంతి కుటుంబంతో హోంమంత్రి అనిత

మహిళా కానిస్టేబుల్‌కు హోంమంత్రి సత్కారం

రంగంపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి తన చంటి బిడ్డను ఎత్తుకొని మరీ ట్రాఫిక్ విధులు నిర్వర్తించిన తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మహిళా కానిస్టేబుల్ జయశాంతిని హోంమంత్రి వంగలపూడి అనిత అభినందించి, సత్కరించారు. గురువారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో జయశాంతికి మంత్రి పట్టు వస్త్రాలు ఇచ్చి, ఆమె కుటుంబ సభ్యులతో అల్పాహారం చేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జయశాంతి తన పరిధి కానప్పటికీ సామాజిక బాధ్యతతో ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన విషయం తెలుసుకున్న మంత్రి అనిత ఆమెకు ఫోన్ చేసి అభినందించారు. ఆ సమయంలో మంత్రిని కలవాలన్న తన ఆకాంక్షను జయశాంతి వ్యక్తం చేయగా, గురువారం ఆ కోరికను మంత్రి నెరవేర్చారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే పోలీస్ సోదరీమణులపై తనకు ప్రత్యేక గౌరవం ఉంటుందన్నారు. ప్రతి పోలీస్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.


రాష్ట్రపతి భవన్ నుంచి వచ్చిన ఆహ్వాన పత్రికను చూపిస్తున్న సంజన

రాష్ట్రపతి విందుకు సిక్కోలు విద్యార్థిని

దేశవ్యాప్తంగా ఎంపికైన ఆరుగురిలో సంజన

పలు అంశాలపై ప్రాజెక్టుల తయారీతో ప్రతిభ

నరసన్నపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 26న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చే విందుకు రాష్ట్రం నుంచి శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇప్పలి సంజన అనే విద్యార్థినికి ఆహ్వానం అందింది. దేశవ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు ఎంపిక కాగా.. అందులో సంజన ఒకరు. ఆమె ప్రస్తుతం శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పలి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గత మూడు సంవత్సరాల్లో అటల్ ఇన్నోవేషన్ మిషన్‌కు పలు ప్రాజెక్టులు తయారు చేసి పంపింది. వీటిల్లో డ్యూయెల్ యాక్సిస్ సోలార్ ట్రాకర్ సిస్టమ్‌పై ఓ ప్రాజెక్టును రూపొందించింది. సదరు విద్యార్థిని ప్రతిభను గుర్తించిన అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి అయోగ్ సంజనకు రాష్ట్రపతి భవన్ విందులో పాల్గొనే అవకాశంపై సిఫారసు చేసింది. రాష్ట్రపతి భవన్‌లో విందుకు ఆహ్వానం రావడంపై సంజన హర్షం వ్యక్తం చేసింది. ఉపాధ్యాయులు ఇచ్చిన మార్గదర్శకాలతోనే తాను ప్రాజెక్టులను రూపొందించానని తెలిపింది.

'ఏఎస్‌సీ అర్జున్'.. ఆన్ డ్యూటీ!

దేశంలోనే తొలిసారిగా విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రోబో సేవలు ప్రారంభం



- పలు సేవల్లో ఆర్పీఎఫ్‌కు సహకారం
- స్టేషన్‌లో దొంగలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గుర్తింపు
- ప్రయాణికులకు భద్రతపై సూచనలు కూడా..
- పూర్తి స్వదేశీ సాంకేతికతతో రోబో 'అర్జున్'

విశాఖపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రత, దొంగలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి చెక్ పెట్టడంలో, ఇతర సేవల్లో రైల్వే రక్షణ దళానికి (ఆర్పీఎఫ్) సహకరించేందుకు 'ఏఎస్‌సీ అర్జున్' రంగంలోకి దిగింది! భారతీయ రైల్వేలోనే తొలిసారిగా రోబో సేవలకు వాల్తేరు డివిజన్ శ్రీకారం చుట్టింది. ఈ హ్యూమనాయిడ్ రోబో ఆర్పీఎఫ్‌కు అదనపు బలంగా అందుబాటులోకి వచ్చింది. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో 'ఏఎస్‌సీ అర్జున్' పేరుతో రూపొందించిన ఈ రోబోను గురువారం వాల్తేరు డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అలోక్ బొహ్రా, వాల్తేరు డివిజన్ సీనియర్ డీఎస్సీ ఏకే దూబే విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎల్‌వోటీ కనెక్టివిటీ, రియల్ టైమ్ మానిటరింగ్‌తో 'ఏఎస్‌సీ అర్జున్' రోబోను రూపొందించడం జరిగిందన్నారు. ఆర్పీఎఫ్ సిబ్బందికి అసిస్టెంట్ స్మార్ట్‌గా పనిచేస్తూ ప్రయాణికుల భద్రత, రక్షణ, ఇతర సేవలందిస్తుందని తెలిపారు. స్టేషన్‌లోని ఎనిమిది ప్లాట్‌ఫామ్‌లతోపాటు రైల్వే కార్యాలయాలు, పార్కింగ్ స్థలాల నావిగేషన్‌ను రోబోలో పొందుపరచడంతో విశేష సేవలందుతాయని అభిప్రాయపడ్డారు. ఆర్పీఎఫ్ ఐజీ అలోక్ బొహ్రా మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణను బలోపేతం చేయడంలో ఫ్రంట్ లైన్ సిబ్బందికి మద్దతుగా ఈ రోబో పనిచేస్తుందన్నారు. తొలి రోబో సేవలకు శ్రీకారం చుట్టిన వాల్తేరు డివిజన్ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.


విశాఖ రైల్వేస్టేషన్‌లో రోబోను ప్రారంభిస్తున్న వాల్తేరు డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అలోక్ బొహ్రా, వాల్తేరు డివిజన్ సీనియర్ డీఎస్పీ ఏకే దూబే

రోబో అందించే సేవలు ఇవీ..!

రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించి, జనసమూహంలో తిరిగే దొంగలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను 'ఏఎస్‌సీ అర్జున్' ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ ద్వారా గుర్తిస్తుంది. తద్వారా ఆర్పీఎఫ్ సిబ్బందిని హెచ్చరించి, అప్రమత్తం చేస్తుంది. రద్దీ సమయంలో ప్రయాణికులకు సందేశాలు ఇవ్వడంతో పాటు ఆర్పీఎఫ్ సిబ్బందికి నియంత్రణ సూచనలు జారీచేస్తుంది. భద్రత, సమాచార ప్రకటనలను ఇంగ్లీషు, హిందీ, తెలుగు భాషల్లో ప్రసారం చేయడంతో పాటు ప్లాట్‌ఫామ్‌లపై నిరీక్షించే ప్రయాణికులకు భద్రతపై అవగాహన, సూచనలు, ప్రమాద హెచ్చరికలు జారీచేస్తుంది. స్టేషన్‌లో ప్రమాదాలు జరిగినప్పుడు వ్యాపించే మంటలు, పొగను ముందుగా గుర్తించి అప్రమత్తం చేస్తుంది.

ఏజెన్సీలో చలి తీవ్రత

హుకుంపేటలో 5.7 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది నుంచి చలిగాలులు మధ్య భారతం మీదుగా తెలంగాణ, ఏపీ వరకూ విస్తరించాయి. ముఖ్యంగా పొరుగునున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో నెలకొన్న శీతల వాతావరణం ఏపీపై ప్రభావం చూపుతోంది. రెండు, మూడు రోజుల నుంచి ఎండ తీవ్రత స్వల్పంగా పెరిగినా రాత్రి మాత్రం చలి వాతావరణం కొనసాగుతోంది. ఏజెన్సీ ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉంది. గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటలో 5.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పొగమంచు దట్టంగా కురిసింది. ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాల్లో మరో రెండు, మూడు రోజుల పాటు పొగమంచు ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తా, రాయలసీమల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని పేర్కొంది.


కోటప్పకొండ పర్యాటక కేంద్రంలో జింకకు గ్రాసం తినిపిస్తున్న పవన్‌కల్యాణ్

త్రికోటేశ్వరుని సన్నిధిలో పవన్

కొత్తపాలెం-కోటప్పకొండ రోడ్డుకు ప్రారంభోత్సవం

- శివరాత్రికి ముందే నిర్మాణం పూర్తి.. తీరనున్న భక్తుల కష్టాలు
- గిరిప్రదక్షిణ రోడ్డు పూర్తి చేయాలని ఆదేశం

కోటప్పకొండ (నరసరావుపేట), జనవరి 22(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండను గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ సందర్శించారు. మేధా దక్షిణామూర్తి స్వరూప శ్రీత్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని, అష్టోత్తర పూజలు చేశారు. స్వామికి పట్టు వస్త్రాలు, ఫలాలు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజా మల్రాజు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు పవన్ కల్యాణ్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించగా.. వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. దేవదాయశాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఆలయ ముఖ్య అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పవన్ కల్యాణ్ సంప్రదాయబద్ధంగా తలపాగా చుట్టి, ఆలయ ప్రదక్షిణ చేసి ఉత్తరద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్, కలెక్టర్ కృత్తికాశుక్లా, మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య తదితరులు స్వామివారి పూజలో పాల్గొన్నారు. అనంతరం గిరిప్రదక్షిణ మార్గం నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పవన్ పరిశీలించారు. కోటప్పకొండకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో గిరిప్రదక్షిణ మార్గం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పవన్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఘాట్ రోడ్డులో అటవీ శాఖ ఏర్పాటు చేసిన వనవిహారి జింకల పార్కును పవన్ సందర్శించారు. జింకలకు ఆహారం అందించారు. పార్క్ సందర్శనకు ఏర్పాటు చేసిన ట్రైన్‌ను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.


డిప్యూటీ సీఎం పవన్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అధికారులు

కోటప్పకొండ రోడ్డు ప్రారంభం

త్రికోటేశ్వరస్వామి భక్తులకు పవన్‌కల్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కోటప్పకొండ-కొత్తపాలెం గ్రామాల మధ్య పంచాయతీరాజ్ నిధులు రూ.3.9 కోట్లతో 8 కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే అరవింద్‌బాబు అర్జీ ఇవ్వగా.. శివరాత్రి ఉత్సవాలలోపు నిర్మిస్తామని హామీ ఇచ్చి, నెరవేర్చారు. ఈ రోడ్డుతో సుమారు లక్షన్నర మంది భక్తులకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. పవన్‌కు అరవిందబాబు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి కోటప్పకొండ ఆలయం వరకు, ఆలయం నుంచి నూతన రహదారి ప్రారంభోత్సవం వరకు పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు, కూటమి పార్టీల కార్యకర్తలు రోడ్డుకి ఇరువైపులా నిలబడి పవన్‌కు స్వాగతం పలికారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్లతో 3 కోట్లు స్వాహా!

ప్రకాశం జిల్లా కందుకూరు ఎల్ఐసీ బ్రాంచ్‌లో క్లెయిమ్‌ల స్కాం

- బంధువులు, సన్నిహితుల పేర్లతో ఓ ఏజెంటు చేతివాటం
- ఆ సొమ్మంతా బినామీ నామినీలతో తన ఖాతాకే జమ
- డీవోగా పదోన్నతి పొందిన సదరు ఏజెంటు సస్పెన్షన్
- సమగ్ర విచారణకు రంగంలోకి విజిలెన్స్ టీమ్

కందుకూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలోని కందుకూరు జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) బ్రాంచ్‌లో క్లెయిమ్‌ల స్కాం చోటుచేసుకుంది! సుదీర్ఘకాలం ఆ బ్రాంచ్ పరిధిలో ఏజెంటుగా ఉండి, మూడేళ్ల క్రితం డెవలప్‌మెంట్ ఆఫీసరై, ప్రస్తుతం మార్కాపురం బ్రాంచ్‌లో ఉద్యోగిగా మారిన కనిగిరికి చెందిన పూజల శ్రీనివాసరావు కీలక సూత్రధారిగా తెలిసింది. నకిలీ డెత్ సర్టిఫికెట్లతో రూ.3కోట్ల మేర స్వాహా చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఎల్ఐసీలో పాలసీ తీసుకున్న తర్వాత పాలసీదారుడు మూడేళ్ల తర్వాత చనిపోతే, లోతైన విచారణ చేయకుండానే క్లెయిమ్‌ను పరిష్కరిస్తారు. ఈ నిబంధనను ఉపయోగించుకున్న సదరు ఏజెంటు కొంతమంది పేర్లతో నకిలీ పాలసీలు చేశాడు. మూడు నాలుగేళ్లు ప్రీమియం కట్టి, ఆ తర్వాత వేర్వేరు తేదీలతో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో క్లెయిమ్‌లు పెట్టారు. అవన్నీ పరిష్కారమై నామినీలుగా పెట్టిన ఆయన కుటుంబసభ్యుల ఖాతాలకు డబ్బు జమయింది. ఈ వ్యవహారంలో పాలసీలకు ఆధార్ అనుసంధానం కాకపోవడాన్ని సదరు ఏజెంట్ సద్వినియోగం చేసుకున్నాడు. ఒకే పాలసీదారుడి పేరుపై అనేక పాలసీలు చేశారు. ఒక వ్యక్తికే వేర్వేరు సంవత్సరాలలో వేర్వేరు తేదీల్లో మూడు డెత్ సర్టిఫికెట్లతో క్లెయిమ్‌లు చేశాడు. విచిత్రం ఏమిటంటే చనిపోయాడని పేర్కొన్న వ్యక్తి పేరుతో మరో 2 పాలసీలు ఫోర్స్‌లో ఉండటం గమనార్హం. దీన్ని ఎల్ఐసీలో కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్ గుర్తించింది. ఆ తర్వాత కొన్ని పాలసీలకు క్లెయిమ్‌లు రావడాన్ని పట్టుకోవటంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

97 క్లెయిమ్‌లపై సమగ్ర విచారణ

నెల్లూరు రీజినల్ ఆఫీసు ఈ అక్రమాన్ని గుర్తించి సమగ్ర విచారణకు విజిలెన్స్ టీంను నియమించింది. నకిలీ డెత్ సర్టిఫికెట్లతో క్లెయిమ్ చేసిన పాలసీలకు కొన్నింటికి నామినీదారులుగా సదరు ఏజెంటు కుటుంబసభ్యులే ఉండగా.. మరికొన్ని పాలసీల నామినీదారులు కూడా తమ అకౌంట్‌కు సొమ్ము జమ కాగానే, ఆ మొత్తాన్ని ఆ ఏజెంటు బ్యాంకు ఖాతాకు బదిలీ చేసినట్లు గుర్తించారు. సదరు ఏజెంటు 2023లో ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందగా, అంతకుముందు ఏజెంటుగా ఉన్న కాలంలో రెండేళ్లపాటు ఈ వ్యవహారం నడిపించినటు గుర్తించింది. అతడికి సంబంధించిన మొత్తం 97 క్లైమ్‌లపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. డీవో శ్రీనివాసరావుకు సస్పెన్షన్ నోటీసులు ఇచ్చిన ఉన్నతాధికారులు.. ఆయనపై క్రిమినల్ చర్యలకు సిద్ధమైనట్లు తెలిసింది. ఎంతమొత్తంలో స్వాహా జరిగిందన్న దానిపై విజిలెన్స్ టీం విచారిస్తోందని బ్రాంచ్ మేనేజరు జనార్దన్ తెలిపారు.


కందుకూరు ఎల్ఐసీ కార్యాలయం

జీవీఎంసీ ఎస్ఈ గుండెపోటుతో మృతి

- చెత్త తరలింపుపై సమీక్షలో మాట్లాడుతూ కుప్పకూలిన ఎస్ఈ

విశాఖపట్నం/గాజువాక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మెకానికల్ విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గోవిందరావు (61) గురువారం గుండెపోటుతో కన్నుమూశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ ఎస్ఈ గోవిందరావు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కార్పొరేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మరోసారి గుండెపోటు రావడంతో తుది శ్వాస విడిచారు. గాజువాక జోన్ పరిధి 76వ వార్డులోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. చెత్తను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించాల్సిన 'రాసా' సంస్థ కొద్దిరోజులుగా ఆ పని నిలిపివేసింది. దీంతో ఈ చెత్తను తరలించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 20న స్థానికులు జీటీఎస్ యార్డుకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ విషయం పట్టాభి దృష్టికి వెళ్లడంతో ఆయన గురువారం నగరానికి వచ్చారు. గాజువాక జోనల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్ శేషాద్రితో సమీక్ష నిర్వహించారు. చెత్త పేరుకుపోవడంపై ఎస్ఈ గోవిందరావును చైర్మన్ ప్రశ్నించగా సమాధానమిస్తూనే.. కుర్చీలో కూలబడిపోయారు. షుగర్ లెవెల్స్ పెరిగి, అపస్మారక స్థితికి వెళ్లిపోయారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులతో సీపీఆర్ చేయించి, ప్రైవేటు ఆస్పత్రికి ఆపై.. అంబులెన్స్‌లో కార్పొరేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మరోసారి గుండెపోటురావడంతో తుదిశ్వాస విడిచారు.


జోనల్ కార్యాలయంలో కుప్పకూలిన ఎస్‌ఈకి ప్రాథమిక చికిత్స అందిస్తున్న దృశ్యం



'చివరి' కోరిక.. తీర్చుకున్నాడిలా..!

అతనో రిటైర్డ్ ఉద్యోగి. పేరు కుందుర్తి లక్ష్మయ్య. వయసు ఎనభై ఏళ్లు. ఏలూరు జిల్లా నూజివీడు టౌన్‌లోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో.. బొందులి క్షత్రియ శ్మశాన వాటికలో కొత్తగా నిర్మించిన అంత్యక్రియల షెడ్డును బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మయ్య కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా.. 'షెడ్డు బాగా నిర్మించారు. ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించే తొలి పార్థివ దేహం నాదే అయితే బాగుంటుంది' అంటూ అక్కడున్నవారికి తన మనసులో మాట చెప్పుకున్నారు. ఈ మాటలు అన్న కొద్దిసేపటికే కూర్చున్న కుర్చీలోంచి ఆయన పక్కకు ఒరిగిపోయారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆయనను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఆయన కోరిక మేరకు నేత్రాలు దానం చేసి, లక్ష్మయ్య పార్థివ దేహానికి గురువారం ఆ షెడ్డులోనే తొలి అంత్యక్రియలు జరిపారు.

- నూజివీడు టౌన్, ఆంధ్రజ్యోతి

తెలుగు రాష్ట్రాల మీదుగా 'అమృత్ భారత్'

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రయాణికులకు వందేభారత్ తరహా అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు' తెలుగు రాష్ట్రాల మీదుగా మరో సర్వీసును అందించనున్నాయి. కేరళలోని తిరువనంతపురం నుంచి దేశవ్యాప్తంగా 4 అమృత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఇప్పటికే చర్లపల్లి- ముజఫర్‌పూర్(బిహార్) మధ్య ఒక అమృత్ భారత్ సేవలందిస్తుండగా, తాజాగా ప్రారంభం కానున్న తిరువనంతపురం- చర్లపల్లి వీక్లీ ఎక్స్‌ప్రెస్ తెలంగాణకు రెండోది కావడం గమనార్హం. జనవరి 27నుంచి అందుబాటులోకి రానున్న రైలు ప్రతి మంగళవారం ఉదయం 7గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి.. మరుసటి రోజు మధ్యాహ్నం 2.45 నిమిషాలకు తిరువనంతపురం చేరుకుంటుంది. తిరిగి బుధవారం సాయంత్రం తిరువనంతపురంలో మొదలై, గురువారం రాత్రి 11.30 గంటలకు చర్లపల్లికి చేరుకోనుంది. ఏపీలోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంటల మీదుగా ప్రయాణిస్తుంది. ప్రయాణికులు శుక్రవారం నుంచి రైల్‌వన్ యాప్ లేదా టికెట్ కౌంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

ప్రధాన ఆకర్షణలివే

ఈ రైళ్లు పూర్తిగా నాన్‌ఏసీ అయినప్పటికీ, వందేభారత్ తరహాలో ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. ఈ రైలులో 8 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 11 జనరల్ సెకండ్ క్లాస్, 2 దివ్యాంగుల కోచ్‌లతో పాటు ఒక ప్యాంట్రీ కార్ ఉంటాయి. 2 ఇంజన్లు ఉండడం వల్ల త్వరగా వేగం పుంజుకుంటుంది. మెరుగైన ఎర్గొనామిక్ డిజైన్, ప్రతిసీటు వద్ద చార్జింగ్ పాయింటు, ఫోల్డబుల్ స్నాక్ టేబుల్స్‌తో పాటు ప్రతి కోచ్‌లో సీసీటీవీ పర్యవేక్షణ, సెన్సార్ ట్యాప్‌లు, మోడరన్ టాయిలెట్లు, ఎలక్ట్రో-న్యూమాటిక్ ఫ్లషింగ్ తదితర సదుపాయాలున్నాయి. దివ్యాంగుల కోసం వీల్‌చైర్ రాంప్‌లు, ఆన్‌బోర్డ్ ఫుడ్ సర్వీస్ వంటివి ఉంటాయని అధికారులు వెల్లడించారు.



హైవేపై అగ్ని కీలలు

అర్ధరాత్రి హైవేపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

(మొదటి పేజీ తరువాయి)

అవతలివైపు ఎదురుగావస్తున్న కంటైనర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో కంటైనర్‌లో సంభవించిన మంటలు బస్సుకు కూడా అంటుకోవడంతో అవి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అయితే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండటంతో భారీ ప్రాణనష్టం తప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సజీవ దహనం కాగా, మరొకరు తీవ్రంగా గాయపడి మృతిచెందారు. బస్సులో ఉన్న 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

టైర్ పేలి.. డివైడర్‌ను దాటి..

ఏఆర్ అండ్ బీసీవీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు బుధవారం రాత్రి 8:30 గంటలకు 36 మంది ప్రయాణికులతో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరింది. 40వ జాతీయ రహదారిపై రాత్రి 1:15 గంటలకు శిరివెళ్ల మెట్ట వద్ద బస్సు ముందు టైరు (కుడి వైపు) పేలింది. దీంతో ఒక్కసారిగా అదుపుతప్పిన బస్సు.. డివైడర్ ఎక్కి దాదాపు వంద మీటర్ల మేర దానిమీదే ప్రయాణించింది. ఆ తర్వాత హైవేకి కుడి వైపున హైదరాబాద్ నుంచి కడప వైపు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాదం నుంచి బయటపడేందుకు ప్రయత్నించగా బస్సు మెయిన్ డోర్ తెరుచుకోలేదు. దీంతో కొందరు బస్సు వెనుక వైపు ఉన్న ఎమర్జెన్సీ తలుపులను ధ్వంసం చేసి బయటపడ్డారు. రహదారిపై వెళ్తున్న వాహనదారులు, శిరివెళ్లకు చెందిన కొందరు యువకులు చొరవచూపి మరికొన్ని అద్దాలు పగలగొట్టి మిగిలినవారిని కూడా బయటకు లాగారు. దీంతో బస్సులోని 36 మంది ప్రాణాలతో బయటపడ్డారు. గాయపడిన వైభవ్, హేమంత్, వినీత, మంజువాణి, మరికొందరిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మంటలు ఎలక్ట్రిక్ స్కూటర్లకు అంటుకుని..

కంటైనర్ లారీ ఎలక్ట్రికల్ స్కూటర్ల లోడుతో బుధవారం హైదరాబాద్ నుంచి పోరుమామిళ్లకు బయల్దేరింది. శిరివెళ్ల మెట్ట వద్ద అదుపుతప్పిన ట్రావెల్స్ బస్సు.. ఈ లారీని ఢీకొట్టడంతో అది జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి పడిపోయింది. ఈ ఘటనలో ట్రావెల్స్ బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్ వారివారి క్యాబిన్లలో



ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన ప్రైవేట్ స్లీపర్ ఏసీ బస్సు

ఇరుక్కుపోయారు. ఈ క్రమంలో లారీలో మంటలు చెలరేగి ఎలక్ట్రికల్ స్కూటర్లకు అంటుకున్నాయి. ఆ మంటలను చూసి బస్సులోని ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. కొందరు బస్సు అద్దాలను ధ్వంసం చేసి బయటకు దూకారు. స్థానికులు, ఇతర వాహనదారులు శ్రమించి మిగిలిన వారిని బయటకు తీశారు. ఆ తర్వాత కొన్ని నిమిషాలకే కంటైనర్ నుంచి మంటలు ట్రావెల్స్ బస్సుకు వేగంగా వ్యాపించాయి. మంటల తీవ్రత అధికమై బస్సు అగ్ని కీలకల్లో చిక్కుకుంది. దీంతో బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ దుస్సా ఓబులేసు అలియాస్ భాస్కర్ (47) సజీవ దహనమయ్యాడు. కంటైనర్ లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్ నవీన్‌కుమార్ (25) సైతం మంటల్లో చిక్కుకుని మాంసపు ముద్దయ్యాడు. లారీలోని మరో డ్రైవర్ అభిషేక్ (25) రహదారిపైకి ఎగిరిపడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని కంటైనర్ లారీ, బస్సు నుంచి ఎగిసిపడుతున్న మంటలను అదుపు చేశారు. రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ,



లారీ క్లీనర్ కమ్ డ్రైవర్ అభిషేక్ మృతదేహం



అగ్నికి ఆహుతైన ఎలక్ట్రిక్ స్కూటర్లు

నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

మృతులు ముగ్గురూ కడప వాసులే...

ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, లారీలోని ఇద్దరు డ్రైవర్లు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ముగ్గురినీ కడప పట్టణానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. బస్సులో ప్రయాణించిన నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన పరిటాల వైభవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ దుస్సా ఓబులేసు అలియాస్ భాస్కర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు పిల్లలతో బయటపడ్డా



సంక్రాంతి సందర్భంగా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలోని పుట్టింటికి వచ్చాం. పిల్లలతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. బస్సు ఒక్కసారిగా అదుపు తప్పడంతో అందరం కింద పడిపోయాం. బయట నుంచి కొందరు వ్యక్తులు బస్సు అద్దాలు పగలగొట్టారు. దీంతో ప్రాణాలతో బయటపడ్డాం. ఆ తర్వాత మంటలు చెలరేగి బస్సు దగ్ధమైంది. దాదాపు పది తులాల బంగారు నగలు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.

- అనూష, ప్రయాణికురాలు, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు

అద్దాలు పగలగొట్టి బయటికొచ్చా



ప్రైవేట్ ఉద్యోగ రీత్యా ఆత్మకూరు పరిధిలోని కట్టంపాడు నుంచి ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరా. అర్ధరాత్రి సమయంలో బస్సు అదుపుతప్పడంతో భయభ్రాంతులకు గురయ్యాం. ఎలాగైనా ప్రాణాలు కాపాడుకోవాలని కొందరు ప్రయాణికులతో కలిసి అద్దాలు పగలగొట్టి బయటికొచ్చా. ల్యాప్‌టాప్, బ్యాగులు మంటల్లో కాలిపోయాయి.

- ప్రవీణ్, ప్రయాణికుడు, ఆత్మకూరు, నెల్లూరు

శభాష్ సురేంద్ర!

- బస్సు సహాయకుడి అప్రమత్తతతో తప్పిన ప్రాణనష్టం
- పారిపోకుండా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన వైనం
- ఎమర్జెన్సీ డోర్ ధ్వంసం చేయించి సురక్షితంగా బయటకు
- బయటి నుంచి అద్దాలు పగులగొట్టిన శిరివెళ్ల యువకులు
- చిన్నటేకూరు ఘటనను గుర్తు తెచ్చుకున్న ప్రయాణికులు



సురేంద్ర

శిరివెళ్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం... కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారిపై వి.కావేరి ట్రావెల్స్ స్లీపర్ బస్సు అగ్నికి ఆహుతైన ఘటనలో 19 మంది సజీవ దహనం అయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ ప్రయాణికులను కాపాడే ప్రయత్నం చేయకపోగా అక్కడి నుంచి పరారయ్యాడు. సరిగ్గా అలాంటి మరో దుర్ఘటన నంద్యాల జిల్లా శిరివెళ్ల మెట్ట వద్ద బుధవారం అర్ధరాత్రి 1:15 గంటలకు చోటుచేసుకుంది. ఈసారి బస్సులో డ్రైవర్‌కు సహాయకుడిగా ఉన్న సురేంద్ర అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఆయన ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా, బస్సులోని ప్రయాణికుల్లో చాలా మంది మంటలకు ఆహుతయ్యేవారే. బస్సు టైర్ పేలిన తర్వాత డివైడర్‌ను దాటి, ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీకొట్టింది. బస్సు మెయిన్ డోర్ తెరుచుకోకపోవడంతో ప్రయాణికులంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం సంభవించగానే అప్రమత్తమైన సురేంద్ర.. ప్రయాణికుల సహాయంతో బస్సు వెనుక వైపున్న అత్యవసర ద్వారాన్ని ధ్వంసం చేయించి కొందరిని సురక్షితంగా బయటకు చేర్చారు. శిరివెళ్లకు చెందిన యువకులు బయటి నుంచి రాళ్లు, ఇనుప రాడ్లతో బస్సు అద్దాలను పగులకొట్టి చిన్న పిల్లలు, ప్రయాణికులను కాపాడారు. ఇతర వాహనదారులు సైతం స్పందించి పలువురిని బయటకు తీసుకొచ్చారు. బస్సులో మంటలు రేగకముందే ప్రయాణికులను కాపాడటంలో వీరంతా కీలకంగా వ్యవహరించారు. నిమిషాల వ్యవధిలోనే బస్సులోని ప్రయాణికులంతా ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బయటపడ్డారు. కాగా, చినటేకూరు ఘటన తరహాలో ప్రమాదం జరగ్గానే తప్పించుకోవడానికి ప్రయత్నించకుండా.. ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో పాటు వారిని సురక్షితంగా కిందకు దించడంలో కీలకంగా వ్యవహరించిన సురేంద్రను అందరూ అభినందించారు. శిరివెళ్లకు చెందిన యువకులతో పాటు సురేంద్రకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

15 మందిని బయటకు తీసుకొచ్చా

ట్రావెల్స్ బస్సు శిరివెళ్ల మెట్టకు వచ్చే సమయానికి మెలకువగానే ఉన్నా. బస్సు టైరు పేలడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. బస్సు డివైడర్‌ను ఢీకొట్టగానే ముందుకు పడిపోయా. ఏం జరిగిందో తెలిసేలోపే బస్సు లారీని ఢీకొట్టింది. దీంతో వెంటనే అప్రమత్తమై కేకలు వేస్తూ ప్రయాణికులను నిద్ర లేపా. బస్సు వెనుక వైపు ఉన్న ప్రయాణికుల సాయంతో ఎమర్జెన్సీ అద్దాలను ధ్వంసం చేసి దాదాపు 15 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చా. నా సహద్యోగి డ్రైవరన్న ప్రాణాలను కాపాడలేకపోయా. నా కళ్ల ముందే ఆయన సజీవ దహనం కావడాన్ని తట్టుకోలేకపోతున్నా.

- సురేంద్ర, ట్రావెల్స్ బస్సు సహాయకుడు



లోకేశ్ జన్మదినం సందర్భంగా గుంటూరులో నిర్వహించిన శకటాల ప్రదర్శన

వినూత్నంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

- ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ నేతృత్వంలో శకటాలతో గుంటూరులో భారీ ప్రదర్శన

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం గుంటూరులో అట్టహాసంగా నిర్వహించారు. ఈ నెల 23న లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆధ్వర్యంలో వినూత్నంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ప్రస్థానానికి అద్దం పట్టేలా వివిధ శకటాలతో గుంటూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు. విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రిగా, పార్టీ నేతగా నారా లోకేశ్ సాధించిన విజయాలు, ఘనతలు, చేసిన అభివృద్ధి పనులను, మంగళగిరి నియోజకవర్గాన్ని మోడల్‌గా రూపొందిస్తున్న తీరును, పార్టీ శ్రేణులకు భరోసాగా నిలిచిన అంశాలను, 5 లక్షల బీమా వంటి పలు అంశాలతో శకటాలను రూపొందించి గుంటూరులో ప్రదర్శించారు.

కర్పూర దీపాలతో శాప్ చైర్మన్ శుభాకాంక్షలు



తిరుపతి(మంగళం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు శాప్ చైర్మన్ రవినాయుడు వినూత్న రీతిలో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతిలోని మంగళం మిట్టూరు క్రీడా మైదానం వద్ద అక్షరాలను భూమిలో చెక్కించి, ఆ అక్షరాల్లో దూది, కర్పూరం నింపి వెలిగించారు.

మంత్రి లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా తిరుమలలో ఒక్కరోజు అన్నప్రసాద వితరణ

- రూ.44 లక్షలు విరాళంగా అందజేసిన భాష్యం రామకృష్ణ



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం చెక్కును అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య)/ తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న లోకేశ్‌కు కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. శుక్రవారం మంత్రి లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టీటీడీ ఒక రోజు అన్నదానం నిమిత్తం భాష్యం రామకృష్ణ రూ.44 లక్షల విరాళాన్ని తిరుమలలో చైర్మన్ బీఆర్ నాయుడును గురువారం కలిసి అందజేశారు.

అంతరిక్ష రంగంలో స్టార్టప్‌ల విప్లవం రావాలి

- హైదరాబాద్ ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్
- విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ప్రారంభమైన ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్ 2026



ప్రదర్శనలు తిలకిస్తున్న డాక్టర్ చౌహాన్, డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 22(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష రంగంలో స్టార్టప్‌ల విప్లవం రావాలని హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్ తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో గురువారం ఏపీ స్పేస్‌టెక్ అకాడమీ(అమరావతి), అనంత్ టెక్నాలజీస్(హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్-2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ మాట్లాడుతూ దేశంలో అంతరిక్ష సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. 2040 నాటికి ప్రపంచ అంతరిక్ష ఉత్పత్తిలో భారత్ వాటా 10 శాతానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో ప్రవేశించే యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు ఎదురుచూస్తున్నాయన్నారు. విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధన ఉన్న చోట ఆ దేశం అభివృద్ధి చెందుతుందనే ఒక నానుడిని గుర్తు చేస్తూ, స్పేస్ టెక్నాలజీ కేవలం శాస్త్రవేత్తలకే పరిమితం కాకుండా, సమాజ అభివృద్ధికి ఉపయోగపడే సాధనంగా మారిందన్నారు. అనంత్ టెక్నాలజీస్ సీఎండీ, విజ్ఞాన్స్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు మాట్లాడుతూ అంతరిక్ష సాంకేతికత ప్రతి సామాన్యుడికి చేరాలని సూచించారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థులే సొంతంగా శాటిలైట్‌ను తయారు చేసి ప్రయోగించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఏపీ స్పేస్‌టెక్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.శేషగిరిరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉంటే చంద్రుడు, అంగారకుడు వంటి గ్రహాలపై లభించే వనరులను కూడా భవిష్యత్తులో వినియోగించుకోవచ్చని.. అలా చేస్తే ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు.

పర్యావరణ అనుమతులు తీసుకుని.. చింతలపూడి పూర్తి చేస్తాం: నిమ్మల

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుమతులు తీసుకుని చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. మూడు నెలల్లో పర్యావరణ అనుమతులు తీసుకోవాలని ఎన్జీటీ చెప్పినా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఫలితంగా పథకం నిలిచిపోయిందని రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో చింతలపూడి ఎత్తిపోతల పథకంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. పర్యావరణ అనుమతులు సాధిస్తామని, అడ్డంకులు తొలగించి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెలాఖరులోగా నీటి సంఘాల ప్రతినిధులతో సీఎం సమావేశం ఏర్పాటు చేస్తారని చెప్పారు. నీటి రక్షణ, వాటర్ క్యాలెండర్, భూగర్భ జలాల పెంపు వంటి అంశాలపై సాగునీటి సంఘాలతో చర్చిస్తారన్నారు.

బాబోయ్ పులి...

- ఒకేరోజు ఐదు ఆవులను చంపిన వైనం
- భయాందోళనలో ఏలూరు ఏజెన్సీ గిరిజనులు
- ఆచూకీ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు

బుట్టాయగూడెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పెద్దపులి సంచారంతో ఆదివాసీలు, ఏజెన్సీ ప్రజానీకం తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటివరకు ఒక్క రోజులోనే ఐదు ఆవులను పులి పొట్టన పెట్టుకుంది. బుధవారం జిల్లా ఏజెన్సీలో ప్రవేశించిన పులి గురువారం తెల్లవారేసరికి మూడు ఆవులను చంపేసింది. అందులో ఒక చూడి ఆవు ఉంది. గురువారం ఉదయం బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెంకు చెందిన కొవ్వాసి బుచ్చయ్యకు చెందిన ఆవు, నాగులగూడేనికి చెందిన చోడెం సీతమ్మకు చెందిన రెండు ఆవుల (ఒకటి చూడిది)ను చంపేసింది. జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్‌రెడ్డి, ఇతర అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మిగిలిన పశువులను వేరే ప్రాంతంలో కట్టివేయాలని సూచించారు. అయితే సాయంత్రం 6.30 గంటల సమయంలో చోడెం సీతమ్మకే చెందిన మరో రెండు ఆవులను పులి చంపింది. సూరప్పవారిగూడేనికి చెందిన మునేంద్ర అనే వ్యక్తికి చెందిన పొగాకు తోటల్లో పనిచేస్తున్న పాలేరు బొల్లి శ్రీనివాసరెడ్డి మరికొందరు ఆవు అరుపులు విన్పించడంతో అక్కడకు వెళ్లారు. జామాయిల్ తోటలో ఆవును తింటున్న పులిని ప్రత్యక్షంగా చూసి భయంతో పరుగులు పెట్టి ఇళ్లకు చేరుకున్నారు. పులి కదలికల సమాచారం కోసం జంగారెడ్డిగూడెం, ములగలంపల్లి అటవీ శాఖ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్ రెడ్డి తెలిపారు. పులి జాడను తెలుసుకోడానికి పలుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నామని చెప్పారు.

రథసప్తమికి సర్వం సిద్ధం

- బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ద్వార దర్శనాల తరహాలోనే వైభవంగా నిర్వహిస్తాం: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు
- గ్యాలరీల్లోని భక్తులకు 14 రకాల ప్రసాదాలు



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ద్వార దర్శనాలను విజయవంతం చేసినట్టుగానే ఈ నెల 25వ తేదీన తిరుమలలో రథసప్తమి వేడుకలను కూడా వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మితో కలిసి ఆయన గురువారం సాయంత్రం రథసప్తమి ఏర్పాట్లను మీడియాకు వివరించారు. ఆ రోజు తిరుమలకు రెండున్నర లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. 2,500 మంది పోలీసు, విజిలెన్స్ సిబ్బందితో పటిష్టమైన భద్రత నడుమ రథసప్తమి వాహనసేవలను నిర్వహిస్తామన్నారు. ఆ రోజు గ్యాలరీల్లోకి చేరే భక్తుల కోసం 14 రకాల వంటకాలు సిద్ధం చేస్తున్నామమని వెల్లడించారు. 85 కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా అన్నపానీయాలను అందించేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు.

పలు సేవలు రద్దు

రథసప్తమి రోజు శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలతో పాటు ప్రత్యేక దర్శనాలు, వీఐపీ బ్రేక్ (ప్రొటోకాల్ మినహా) దర్శనాలను రద్దు చేశామని, ఎక్కువ సంఖ్యలో భక్తులకు దర్శనం చేయించేలా 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీ నిలిపివేస్తామని చైర్మన్ తెలిపారు.

మాడవీధుల్లో ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు

- గ్యాలరీల్లోని భక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు

తిరుమల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీ తిరుమలలో రథసప్తమి వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా టీటీడీ ఏఐ ఆధారిత సీసీ కెమెరాలను మాడవీధుల్లోని గ్యాలరీల్లో ఏర్పాటు చేస్తోంది. వీటిని వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించనున్నారు. తద్వారా ఏ గ్యాలరీల్లో భక్తులు అధిక సంఖ్యలో ఉన్నారు, ఏ గ్యాలరీలు ఖాళీగా ఉన్నాయి, అసలు ఎంత మంది భక్తులు గ్యాలరీల్లోకి చేరారు.. అనే విషయంలో ఖచ్చితమైన సంఖ్యను తెలుసుకునేలా (హెడ్‌కౌంట్) ఈ కెమెరాలు పనిచేయనున్నాయి. రద్దీ అధికంగా ఉంటే గ్యాలరీల్లో రెడ్ అలర్ట్, ఖాళీగా ఉండే గ్యాలరీల్లో గ్రీన్ అలర్ట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరతాయి. తద్వారా ఆయా ప్రాంతాల్లోని అధికారులను అప్రమత్తం చేసి భక్తులను గ్యాలరీల్లోకి సర్దుబాటు చేయనున్నారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లోనూ ఈ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో తోపులాటలు జరిగే అవకాశమున్నా వెంటనే అలర్ట్ వచ్చేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. రెండురోజుల్లో వీటి అమరిక పనులను పూర్తిచేయనున్నారు.

అరసవల్లి, తిరుమలలో ఘనంగా రథసప్తమి ఏర్పాట్లు: మంత్రి ఆనం

తిరుమల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తిరుమలతో పాటు అరసవల్లిలోనూ రథసప్తమిని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. అరసవల్లిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి అచ్చెన్నాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ప్రస్తుతం అక్కడ ఏర్పాట్లను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

పిల్లల కోసం వ్యవస్థలనే మారుస్తున్నాం

- సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 'సమగ్ర విద్య అంటే పిల్లలను వ్యవస్థకు సరిపడేలా మార్చడం కాదు. పిల్లల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థలనే మార్చడం. అదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దృక్పథం' అని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ సమ్మిట్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఉన్నత విద్యనభ్యసించే అవకాశం కొనసాగించాలి: ఏపీటీఎఫ్

ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఇన్ సర్వీస్ టీచర్లకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కొనసాగించాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. బుధవారం విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగుల జాతీయ మహాసభలు

అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 18వ జాతీయ మహాసభలు ఈ నెల 23 నుంచి 26 వరకు మహారాష్ట్రలోని షిర్డీలో జరగనున్నట్టు సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ తెలిపారు.

నవ్యాంధ్రలో ఫార్మారంగానికి విస్తృత అవకాశాలు

- విశాఖ, తిరుపతి నగరాల్లో వేగంగా విస్తరిస్తున్న ఫార్మాహబ్‌లు
- ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి



ఆచార్య కె.మధుమూర్తి

గుంటూరు(విద్య), జనవరి 22(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో ఫార్మా రంగానికి విస్తృత అవకాశాలున్నాయని, పరిశోధన, ఉత్పత్తి, క్లినికల్ విభాగాలు వేగంగా విస్తరిస్తున్నాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అన్నారు. గుంటూరు శివారు చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో రెండు రోజుల పాటు జరిగే ఇన్నోవేట్ ఫార్మా 2026 అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో నూతన ఆవిష్కరణలకు పరిశోధనలే కీలకమని, నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యువ ఫార్మసీ నిపుణులు సమర్థంగా అందిపుచ్చుకోవాలని సూచించారు. నవ్యంధ్రలో వైజాగ్‌లోని మెడిసిటీ, తిరుపతిలో ఫార్మాసిటీలో దేశీయ, అంతర్జాతీయ సంస్థలు ఔషధాలు తయారు చేస్తున్నాయని తెలిపారు. రూ.కోట్ల పెట్టుబడులతో ప్రారంభమైన ఈ సంస్థలకు ప్రభుత్వం చేయూత అందిస్తోందని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.గంగాధరరావు మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు.



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ విద్యాశాఖలో చేపట్టిన ప్రగతి సంస్కరణలు, ఐటీ ప్రగతి గురించి రేవంత్‌కు ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ విద్యకు నమూనాగా మారిందని, విద్యారంగంలో చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. తెలంగాణలో తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను రేవంత్ వివరించారు. ఐటీఐలను స్కిల్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దామని.. వాటిని సందర్శించాలని లోకేశ్‌ను ఆహ్వానించారు. కోట్లాది మంది దర్శించుకునే మేడారం సమక్క, సారక్క దేవస్థానం ఆధునికీకరణ పనులు రూ.వందల కోట్లతో చేపట్టామని తెలిపారు. దశాబ్దాలుగా ఏ ఒక్క ప్రభుత్వం చూపని విధంగా చొరవ చూపామని.. రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు. మేడారం జాతరకు వచ్చి వనదేవతలను దర్శించుకోవాలని లోకేశ్‌ను రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. పెట్టుబడుల సాధనలో పోటీ పడి దేశానికే తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలువనున్నాయని ఉభయులూ వ్యాఖ్యానించారు.

వేగం పెంచండి!

(మొదటి పేజీ తరువాయి)



టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను సత్కరిస్తున్న సీఎం

సానుకూలత వ్యక్తం చేశారు. ఈ ఏడాది దావోస్ పర్యటన ఎలా సాగిందని చంద్రశేఖరన్ ప్రశ్నించగా.. ప్రపంచ పారిశ్రామిక రంగ పోకడలు, పారిశ్రామికవేత్తల ఆలోచనలు తెలుసుకోవడానికి ఇదో మంచి వేదికగా మారిందని.. ఏపీ బ్రాండింగ్‌కు, కొత్త పాలసీలపై మార్కెట్‌లో అంచనా వేయడానికి ఈ పర్యటన ఎంతో దోహదపడిందని సీఎం బదులిచ్చారు. గత ఏడాది దావోస్ పర్యటన ద్వారా ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని, తాజా పర్యటన కూడా మంచి ఫలితాలే ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధ (ఏఐ), వ్యవసాయం, పర్యాటకం వంటి రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న విజయాలను.. వనరులను సమర్థంగా ప్రపంచ దేశాలకు వివరించగలిగామని, గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు భారత్ వైపు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. యూరప్‌లోని తెలుగు ప్రజలతో మమేకం అవుతూ తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు.

4 రోజులు.. 36కుపైగా కార్యక్రమాలు..

నాలుగు రోజుల దావోస్ పర్యటన ముగించుకుని చంద్రబాబు స్వదేశానికి తిరుగుపయనమయ్యారు. భారతకాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 6.30 గంటలకు అక్కడి నుంచి బయల్దేరారు. శుక్రవారం ఉదయం 8.25కి హైదరాబాద్ చేరుకోనున్నారు. అక్కడి నుంచి 10 గంటలకు అమరావతి చేరుకుని.. 11 గంటల నుంచి సచివాలయంలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. దావోస్ పర్యటనలో 36కుపైగా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతో మూడు సమావేశాల్లో పాల్గొన్నారు. ఆర్సెలార్ మిట్టల్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్, ఐబీఎం సీఈవో అర్వింద్ కృష్ణ సహా 16 మంది దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో నిర్వహించిన 9కిపైగా సెషన్స్, సమావేశాల్లో సీఎం పాల్గొన్నారు.



దావోస్ నుంచి బయల్దేరుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న ప్రవాసాంధ్రులు

విశాఖకు రండి

గ్లోబల్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయండి.. యాక్సెంచర్‌ను కోరిన లోకేశ్



యాక్సెంచర్ సీఈవో మనీశ్ శర్మతో భేటీలో లోకేశ్

- సానుకూలంగా స్పందించిన సీఈవో మనీశ్ శర్మ
- దావోస్‌లో మంత్రితో సమావేశం
- క్వాంటమ్ కంప్యూటింగ్ సదస్సులో పాల్గొన్న లోకేశ్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విశాఖలో గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని యాక్సెంచర్ సీఈవో మనీశ్ శర్మను మంత్రి లోకేశ్ కోరారు. లోకేశ్ ప్రతిపాదనపై ఆయన సానుకూలంగా స్పందించారు. దావోస్ ఆర్థిక సదస్సులో గురువారం లోకేశ్‌ను మనీశ్ శర్మ కలిశారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో మౌలిక సదుపాయాలు, ప్రతిభ లభ్యత, అందుబాటులోకి వస్తున్న సాంకేతిక వ్యవస్థను ఉపయోగించుకుని ఏఐ, క్లౌడ్, డిజిటల్ కార్యకలాపాలపై దృష్టి సారించడానికి గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ అన్నారు. యువతను భవిష్యత్తుకు సిద్ధం చేయాలని కోరారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యకలాపాలకు ఫ్యూచర్ రైట్ స్కిల్స్ నెట్‌వర్క్ ద్వారా సహకారం అందించాలన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అప్లికేషన్లు, ఎకోసిస్టమ్ డెవలప్‌మెంట్‌తో పాటు స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చేందుకు అమరావతి క్వాంటమ్ వ్యాలీలో భాగస్వామ్యం కావాలని కోరారు. జెన్ఏఐ, ఎక్స్ఆర్, బ్లాక్ చైన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై దృష్టి సారించేలా యాక్సెంచర్ ఇన్నోవేషన్ హబ్‌ను రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానం చేయాలని లోకేశ్ అన్నారు. తమ సంస్థ బెంగళూరులో 2023లో ఒక జనరేటివ్ ఏఐ స్టూడియోను ప్రారంభించిందని మనీశ్ వెల్లడించారు. రాబోయే మూడేళ్లలో ఏఐపై ప్రపంచ వ్యాప్తంగా మూడు బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నామని తెలిపారు. తమ సంస్థ ఏఐ, డిజిటల్ టాలెంట్ అభివృద్ధి పై గణనీయంగా పెట్టుబడులు పెడుతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 50,000 ఏఐ నిపుణులను తయారు చేస్తున్నామని వెల్లడించారు. వీరిలో అధికభాగం భారతీయులేనని అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను ఉన్నత స్థాయి కమిటీ దృష్టికి తీసుకువెళతామని మనీశ్ పేర్కొన్నారు.

సోషల్ మీడియా వినియోగంలో చిన్నారులపై ఆంక్షలు!

- 16 ఏళ్లలోపు వారిని దూరంగా ఉంచడంపై అధ్యయనం చేస్తున్నాం
- బ్లూమ్‌బర్గ్ ఇంటర్వ్యూలో లోకేశ్ వెల్లడి

చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ వెల్లడించారు. దావోస్ పర్యటనలో ఉన్న ఆయన బ్లూమ్‌బర్గ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఆస్ట్రేలియాలో గత ఏడాది డిసెంబరు నుంచి 16 ఏళ్ల లోపు చిన్నారులు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం విధించారని, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ విధానం అమలుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని లోకేశ్ తెలిపారు. సోషల్ మీడియాపై ఆంక్షలు లేకపోవడం వల్ల.. దాని ద్వారా రకరకాల కంటెంట్ అందుబాటులోకి వస్తోందని, దానిని అర్థం చేసుకునే పరిణతి చిన్నారుల్లో ఉండదని, ఒక్కోసారి దాని వల్ల దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా 16 ఏళ్లలోపు చిన్నారులను సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలకు దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. అయితే దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. భారతదేశంలో పెట్టుబడులకు ఏపీ ప్రధాన కేంద్రంగా మారుతోందని, దేశం మొత్తంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి రావడమే దీనికి నిదర్శనమని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని.. గత 18 నెలల్లో 4 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు.

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్కు

- తయారీ, ఎగుమతులే లక్ష్యం: లోకేశ్

క్వాంటమ్ కంప్యూటింగ్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగమని మంత్రి లోకేశ్ అన్నారు. నైపుణ్యాలు, కొలాబరేషన్ ద్వారా క్వాంటమ్ ఆవిష్కరణలను వేగవంతం చేయడం అనే అంశంపై దావోస్ ఆర్థిక సదస్సులో చర్చ జరిగింది. ఈ చర్చలో లోకేశ్ ప్రసంగించారు. 2024లో 1.3 బిలియన్ డాలర్లుగా ఉన్న క్వాంటమ్ కంప్యూటింగ్ మార్కెట్ 2025లో 41 శాతం వృద్ధితో 3.77 బిలియన్ డాలర్లకు చేరుకుందని పేర్కొన్నారు. ప్రపంచ క్వాంటమ్ కంప్యూటింగ్ మార్కెట్ 41.8 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటుతో 2030 నాటికి 20 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. రాజధాని అమరావతిలో జూలై నాటికి దక్షిణాసియాలో మొట్టమొదటి, అత్యంత శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్ 133 క్విట్ హెరాన్ ప్రాసెసర్‌తో కూడిన ఐబీఎం క్వాంటమ్ కంప్యూటింగ్ సిస్టమ్-2ను ఐబీఎం, టీసీఎస్ భాగస్వామ్యంతో ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ఇది భారత్‌లో మొట్టమొదటి డెడికేటెడ్ క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్కు కేంద్రమని పేర్కొన్నారు. 50 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్లోబల్ క్వాంటమ్ ల్యాబ్‌లతో పరిశోధనా కేంద్రాలు, ప్రముఖ కంపెనీలతో ఉమ్మడిగా పీహెచ్‌డీ, పోస్ట్-డాక్టోరల్ ప్రోగ్రామ్‌లు, 50వేలకు పైగా అభ్యాసకుల కోసం క్వాంటమ్ రెడీ స్కిల్లింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 3 దశల్లో క్వాంటమ్ నైపుణ్య పైప్‌లైన్‌ను నిర్మిస్తామన్నారు. ఇది ఉన్నత పరిశోధన ఆవిష్కరణలను కవర్ చేసే ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ తయారీ, ఎగుమతులే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్టు తెలిపారు.

డబ్ల్యూఈఎఫ్ గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్‌తో భేటీ



దావోస్‌లో జరిగిన ఏపీ స్టేట్ రౌండ్ టేబుల్ భేటీలో లోకేశ్

వరల్డ్ ఎకనామిక్ ఫోరం గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ మరూస్ బైరౌజ్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఏడాదిలోగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం-ఏపీ సీ4 ఐఆర్ (సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్)ను కార్యాచరణలోకి తీసుకురావడానికి అవసరమైన విధివిధానాలపై చర్చించారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై మరూస్ సానుకూలంగా స్పందించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం-ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెసిలెన్స్‌ను స్థాపించేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. డబ్ల్యూఈఎఫ్ ఆధ్వర్యంలో సీ4 ఐఆర్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు సాధ్యమైనంత త్వరగా ఏపీలో డబ్ల్యూఈఎఫ్ సీ4 ఐఆర్‌ను స్థాపిస్తామని వెల్లడించారు.

విద్యారంగంలో కలసి పనిచేద్దాం

కేంబ్రిడ్జి వర్సిటీ వీసీతో మంత్రి లోకేశ్ భేటీ



కేంబ్రిడ్జి వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డెబ్బీ ప్రెంటిస్‌తో మంత్రి లోకేశ్

కేంబ్రిడ్జి యూనివర్సిటీ వీసీ డెబ్బీ ప్రెంటిస్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఎయిడెడ్ స్కూళ్లలో 8-10 తరగతుల విద్యార్థులకు కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా వాతావరణ మార్పులపై అవగాహన, సుస్థిరత, భవిష్యత్తు నైపుణ్యాలపై కేంబ్రిడ్జి సర్టిఫైడ్ ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలోని వర్సిటీలతో కలసి సంయుక్త పరిశోధన, కరిక్యులమ్ డెవలప్‌మెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజీలపై నిర్మాణాత్మక ఒప్పందానికి చొరవ చూపాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు డెడికేటెడ్ స్కాలర్‌షిప్‌లు, ఫాస్ట్ ట్రాక్ అడ్మిషన్ల ద్వారా ప్రోత్సాహం కల్పించాలని కోరారు. ఏఐ, డేటా సైన్స్, ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతికతలపై జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌ల కోసం ఏయూ, ఐఐటీ-తిరుపతి వంటి సంస్థలతో కేంబ్రిడ్జి వర్సిటీ కలిసి పనిచేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. డెబ్బీ ప్రెంటీస్ స్పందిస్తూ.. భారత్‌లో సీఐఆర్ఎఫ్ ద్వారా వాతావరణ విద్య, బోధనా పద్ధతులు, డిజిటల్ స్కిల్స్, లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లపై దృష్టిసారించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు.

వైసీపీది భూ భక్ష పథకం



జగన్ సర్కారులో ఇచ్చిన పాస్ బుక్, కూటమి ప్రభుత్వం ఇచ్చిన పాస్‌బుక్‌లను చూపిస్తున్న అనగాని

- రీసర్వేపై అబద్ధాలు, అసత్యాలతో విషం కక్కిన జగన్
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపాటు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల రీసర్వేపై మాజీ సీఎం జగన్ అబద్ధాలు, అసత్యాలతో కూటమి ప్రభుత్వంపై విషాన్ని కక్కారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. ప్రజల ఆస్తులు కాజేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో 22ఏను వైసీపీ సర్కారు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. జగన్ తెచ్చింది భూరక్ష పథకం కాదని, భూ భక్ష పథకమని విమర్శించారు. గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'జగ్గయ్యపేట నియోజకవర్గంలో 2018లో టీడీపీ ప్రభుత్వం రీసర్వేను ప్రారంభించి, ఆర్వోఆర్ చట్టంలో మార్పులు తెస్తూ గెజిట్ జారీ చేసింది. కానీ జగన్ మాత్రం తానే రీసర్వేను కనిపెట్టినట్టు, ఇప్పుడు తామేదో ఆయన క్రెడిట్‌ను చోరీ చేస్తున్నట్లు మాట్లాడుతున్నారు. భూ హక్కు పత్రాలపై తన ఫొటో వేయించుకోవడానికి భూమి ఆయనదా? క్రిమినల్ క్రెడిట్ చోరీ తత్వం ఉన్న జగన్.. చంద్రబాబు క్రెడిట్ చోరీ చేశారంటారా?' అని అనగాని మండిపడ్డారు. 'వైసీపీ ప్రభుత్వం చేసిన రీసర్వే తప్పుల తడకగా ఉన్నందునే కూటమి ప్రభుత్వానికి 2.70లక్షల ఫిర్యాదులు అందాయి. జగన్ ఇచ్చిన పాస్‌పుస్తకాల్లో ఒకటీ, రెండు తప్ప అన్నీ తప్పులే. పాస్ పుస్తకంపై భూమి వివరాలు, రైతు ఆధార్, ఫోన్ నంబరు, జీపీఎస్ వంటివి లేకుండా చేశారు. ఇప్పుడు భూమి లోకేషన్‌తో సహా 15 రకాల భద్రత అంశాలను జోడించి క్యూఆర్ కోడ్‌తో వివరాలన్నీ తెలిసేలా రాజముద్రతో రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నాం' అని మంత్రి చెప్పారు.

భూముల విలువపై కసరత్తు చేస్తున్నాం

పట్టణ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువకు, రిజిస్ట్రేషన్ విలువకు మధ్య వ్యత్యాసం ఉన్నచోట్ల భూముల మార్కెట్ విలువను పెంచే అంశంపై కసరత్తు చేస్తున్నట్లు మంత్రి అనగాని తెలిపారు. రాజధాని గ్రామాల్లో గతేడాది భూముల విలువ పెంచలేదని, దానిపై ఈ ఏడాది సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఎనిమిది పదుల వయసులో దావోస్ వెళ్లి రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడం చంద్రబాబు క్రెడిట్ అయితే, గులకరాయి, కోడికత్తి, బాబాయి గొడ్డలి డ్రామాలు ఆడటం జగన్ క్రెడిట్ అని మంత్రి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులను కళ్లుండీ చూడలేని జగన్.. తన రాక్షస మనస్తత్వం వీడకపోతే ఈసారి 11 సీట్లలో 10 పోతాయని అనగాని వ్యాఖ్యానించారు.

ఘోరాలు చేసి నీతులు!

(మొదటి పేజీ తరువాయి)

భూ వివాదాలు వచ్చాయి. జగన్ సర్కారు నాటి ఉమ్మడి కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు అనే చిన్న గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే చేపట్టింది. కేవలం 182 సర్వే నంబర్లు ఉన్న గ్రామంలో దాదాపు 9 నెలలు పైలట్ ప్రాజెక్టు కింద రీసర్వే చేస్తే.. 118 సర్వే నంబర్ల పరిధిలో భూముల విస్తీర్ణంలో భారీ తేడాలు వచ్చాయి. నాడు పైలట్ ప్రాజెక్టు పూర్తయ్యాక రెవెన్యూ శాఖ సమర్పించిన రిపోర్టులోనే ఈ అంశాలున్నాయి. అయినా ఆ రిపోర్టును జగన్ సర్కారు ఆమోదించింది. తప్పులు వస్తున్నాయని వెనకడుగు వేయవద్దని, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో సర్వేచేయాలని నాటి సీఎం జగన్ స్వయంగా ఆదేశించారు. దాని ఫలితమే ఊరూరా రీసర్వే తప్పులు. సర్వే సరిహద్దుల చట్టం-1923 ప్రకారం.. సర్వే చేయానికి ముందే రైతుకు నోటీసులివ్వాలి. రీ సర్వే పూర్తయ్యాక 9(2) నోటీసు ఇవ్వాలి. రైతుల అభ్యంతరాలను పరిష్కరించడానికి గడువు ఇవ్వాలి. ఇవేవీ సక్రమంగా జరగలేదు. అందుకే... ఇన్ని తప్పులు, తిప్పలు.

సర్వే ఆఫ్ ఇండియా ఎందుకు వైదొలగింది?

సర్వే పారదర్శకంగా చేశామని గురువారం ప్రెస్‌మీట్‌లో జగన్ పదేపదే ప్రస్తావించారు. అదే నిజమైతే రీ సర్వే నుంచి సర్వే ఆఫ్ ఇండియా (ఎస్‌వోఐ) ఎందుకు వైదొలగింది? భూముల సర్వేలో పాల్గొనేందుకు ఆ సంస్థ తొలుత ఆసక్తి చూపింది. సేవలతోపాటు టెక్నాలజీ కూడా అందిస్తామని సర్కారుతో ఎంవోయూ కుదుర్చుకుంది. కానీ... రీసర్వే చట్టపరిధిలో సాగడం లేదని, అడ్డగోలు తప్పులు చేస్తూ వాటిని ఆమోదించమంటున్నారంటూ సర్వే ఆఫ్ ఇండియా ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగింది. జగన్ సొంత మనుషులు, సిబ్బందిని తొందరపెట్టినట్లుగా.. ఒత్తిడి చేసినట్లుగా సర్వే ఆఫ్ ఇండియాకు రీసర్వే టార్గెట్లు పెట్టడం వల్లే ఆ సంస్థ వైదొలగిన మాట నిజం. అంతేకాదు... పైలట్ ప్రాజెక్టు జరిగిన తక్కెళ్లపాడులో వచ్చినటువంటి తప్పులే రాష్ట్రమంతా వస్తున్నాయని, రీసర్వేలో లోపాలున్నాయని కలెక్టర్లు, సర్వే అధికారులు నివేదించినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా... రీసర్వేలో తప్పులున్నాయంటూ ఎవ్వరూ నివేదించవద్దని.. సర్వే తప్పులను ఎత్తిచూపవద్దని టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్సుల్లో నాటి సర్వే ఉన్నతాధికారి బెదిరింపులకు దిగారు.

బాబు ఎప్పుడో చేసిన ఆలోచనే ఇది...

'చంద్రబాబుకు రీసర్వే గురించి తెలుసా? ఏనాడైనా ఆలోచించారా? టెక్నాలజీతో సర్వే చేయాలన్న ఆలోచన ఎందుకు రాలేదు?' అని కూడా జగన్ ప్రశ్నలు సంధించారు. అయితే... ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా ఆనాడున్న టెక్నాలజీ ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ (ఈటీఎస్) ద్వారా 2000లోనే చంద్రబాబు రీ సర్వేకు ప్రయత్నించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి, చిత్తూరు జిల్లా వెంకటగిరి కోట, కరీంనగర్ జిల్లా మానుకొండూరు మండలాల పరిధిలో పైలట్ ప్రాజెక్టులు చేపట్టారు. కానీ భూముల విస్తీర్ణంలో తేడాలు రావడం, రైతులు సంతృప్తిగా లేకపోవడంతో పక్కనపెట్టారు. ఆ తర్వాత అంటే 2015లోనూ రీసర్వేకు చంద్రబాబు మరోసారి ప్రయత్నించారు. ఇందుకు తన కుప్పం నియోజకవర్గాన్నే ఎంచుకున్నారు. హై రిజల్యూషన్ శాటిలైట్ ఇమేజ్ (హెచ్ఆర్ఎస్ఐ) టెక్నాలజీ వినియోగించారు. భూముల విస్తీర్ణంలో తేడాలు భారీగా వస్తుండడంతో ఆ పనినీ ఆపేశారు. మరోసారి 2016లో ఈటీఎస్ ఆధారంగా అనంతపురం, కర్నూలు, విశాఖలో రీ సర్వే ప్రయత్నాలు చేశారు. ఇక్కడా భూముల విస్తీర్ణంలో తేడాలు, కొత్త వివాదాలు వస్తుండడంతో నిలిపివేశారు. కానీ... జగన్ సర్కారు పైలట్‌లో తప్పులు వచ్చినా రాష్ట్రమంతా అలాగే తప్పులతో సర్వేచేసి నానా గందరగోళం సృష్టించింది.

డిజిటలైజేషన్ జరిగింది బాబు హయాంలోనే..

భూ రికార్డుల ఆధునికీకరణ గురించి చంద్రబాబుకు తెలుసా అని జగన్ మరో అసంబద్ధ ప్రశ్న వేశారు. వెబ్‌ల్యాండ్ విధానం తీసుకొచ్చింది ఎవరు? భూ రికార్డులను డిజిటలైజ్ చేసి వాటికి చట్టబద్ధత తీసుకొచ్చింది ఎవరు? 2014-19 కాలంలోనే ఇవి జరిగాయని జగన్‌కు తెలిసినా.. ఆ క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకోవాలని అనుకుంటున్నారు. వెబ్‌ల్యాండ్‌లోని ఆర్ఎస్ఆర్ డేటాకు రైతుల ఆధార్‌ను సీడింగ్ చేయించింది కూడా చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వమే. రైతుల భూమి పటాలను తెలిపే భూమి చిత్రపటాలు (ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్స్-ఎఫ్ఎంబీ) అధ్వాన స్థితిలో ఉంటే వాటిని డిజిటలైజ్ చేసింది కూడా చంద్రబాబు ప్రభుత్వమే. 2014-19 కాలంలో 95 శాతం పూర్తయిన ఎఫ్ఎంబీ డిజిటలైజేషన్‌ను జగన్ రాగానే నిలిపివేయించారు. దీంతో అప్పటివరకు ఈ ప్రాజెక్టుపై చేసిన వ్యయం వృధా అయింది.

కార్స్‌తో 2018లోనే భూధార్!

రీసర్వే చేపట్టిన ప్రతి సారీ భూముల విస్తీర్ణంలో తేడాలు వస్తుండడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని చంద్రబాబు భావించారు. ఇందుకు అంతర్జాతీయంగా పేరుగాంచిన అక్షాంశ, రేఖాంశాలతో కూడిన సాంకేతికతను ఉపయోగించాలని నిర్ణయించారు. రైతుకు చెందిన ప్రతి భూమికీ అక్షాంశ, రేఖాంశాలను నిర్దేశించడం ద్వారా ఎవరి భూమి ఎక్కడుందో చూపించి, భూ వివాదాలకు చెక్‌పెట్టాలని భావించారు. దీని ఫలితమే భూధార్ ప్రాజెక్టు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో దీనిని ప్రారంభించారు. టెక్నాలజీలో బాగా అనుభవం ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ సత్యనారాయణ నేతృత్వంలో భూధార్‌ను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కోసమే కార్స్(కంటిన్యుయస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ సిస్టమ్)ను ఉపయోగించాలని నిర్ణయించారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో కార్స్ బేస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఈ మేరకు 2018 సెప్టెంబరు 25న జీవో 1348 జారీచేశారు. ఇది దాచలేని చరిత్ర. 2019లో జగన్ సర్కారు వచ్చాక భూధార్‌ను పక్కనపెట్టేశారు. దానికి రీసర్వే అని పేరుపెట్టారు. అయినా సరే, కార్స్ నెట్‌వర్క్, రోవర్లను తానే తెచ్చానని జగన్ గొప్పగా చెప్పుకోవడం గమనార్హం.

అమెజాన్‌లో 16వేల ఉద్యోగాల కోత?

న్యూఢిల్లీ, జనవరి 22: టెక్ దిగ్గజం అమెజాన్ వచ్చే వారంలో దాదాపు 16వేల ఉద్యోగాల కోతను ప్రకటించే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్నాయి. రానున్న నెలల్లో దాదాపు 30వేల ఉద్యోగుల తొలగింపు ఉంటుందని గత అక్టోబరులో రాయిటర్స్ వార్తా సంస్థ కథనం పేర్కొంది. మొదటి విడతలో 14వేల మందిని తొలగిస్తారని అప్పుడే అంచనా వేయగా అలాగే జరిగింది. ఇప్పుడు రెండో విడతగా ఈనెల 27 నుంచి దాదాపు 16వేల మందిని తొలగించవచ్చన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి.

బ్రెజిల్ ప్రధాని రాక కోసం ఎదురుచూస్తున్నా: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 22: బ్రెజిల్ అధ్యక్షుడు లుల డ సిల్వాకు స్వాగతం పలకడానికి ఎదురు చూస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వచ్చే నెలలో లుల భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం మోదీ ఆయనతో మాట్లాడారు. రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాలపై ముచ్చటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం సుదృఢంగా సాగుతోందని, వచ్చే ఏడాది నూతన శిఖరాలను అధిరోహిస్తుందంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రెండు దేశాలూ ట్రంప్ టారిఫ్‌ల బారిన పడడంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఆస్ట్రేలియాలో మళ్లీ కాల్పుల కలకలం

- ముగ్గురు మృతి

మెల్‌బోర్న్, జనవరి 22: సిడ్నీ ఉగ్రదాడి ఘటన మరువక ముందే ఆస్ట్రేలియాలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. న్యూ సౌత్‌వేల్స్ రాష్ట్రంలోని లేక్ కార్గిలిగో పట్టణంలో గురువారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. సుమారు 1500 జనాభా ఉన్న ఆ చిన్న పట్టణంలో తుపాకీ శబ్దాలు వినిపించడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. కాల్పులకు తెగబడిన దుండగుడు భారీ తుపాకీతో ఇంకా నగరంలోనే ఉన్నాడని పోలీసులు భావిస్తున్నారు. ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. గతేడాది డిసెంబర్ 14న సిడ్నీ బోండి బీచ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన 15మంది మృతులకు నివాళిగా దేశవ్యాప్తంగా సంతాప దినం పాటిస్తున్న రోజే.. ఈ కాల్పులు జరగడం గమనార్హం. ప్రస్తుతం పోలీసులు ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకుని నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.

सत्यमेव जयते
భారత ప్రభుత్వం



దక్షిణ భారత కలలు మరియు ఆకాంక్షల సాకారం!

సమాచార, శాస్త్ర మరియు అనుసంధాన రంగాల్లో నూతన ఉత్తేజం



జాతికి అంకితం

CSIR-NIIST ఇన్నోవేషన్

సాంకేతికత మరియు ఉద్యమ శీలత హబ్

&

రేడియో సర్జరీ కేంద్రం

శ్రీ చిత్ర తిరునాల్ ఇన్స్టిట్యూట్ ఫర్
మెడికల్ సైన్సెస్ & టెక్నాలజీ వద్ద

శంఖుస్థాపన

పూజప్పుర హెడ్ పోస్ట్ ఆఫీస్ భవనం

(తిరువనంతపురం)

ఆవిష్కరణ

క్రెడిట్ కార్డు మరియు రుణాల పంపిణీ

1 లక్ష లబ్ధిదారులకు రుణాల పంపిణీ ప్రధాన మంత్రి స్వనిధి స్కీమ్ ద్వారా

&

ప్రారంభోత్సవం

అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

తిరువనంతపురం - తాంబరం
తిరువనంతపురం - చర్లపల్లి
నాగర్‌కోయిల్ - మంగళూరు జంక్షన్

ప్యాసింజర్ రైలు

త్రిసూర్ - గురువాయూర్

ప్రయోజనాలు

రైల్వే మౌలిక సదుపాయాలు & కొత్త రైలు సేవలు
- రాష్ట్రాల మధ్య మరియు రాష్ట్రాంతర మెరుగైన రైలు అనుసంధానం
- పర్యాటకం, వ్యాపారం మరియు ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం
- కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ మరియు ప్యాసింజర్ రైళ్లతో మెరుగైన రైలు కనెక్టివిటీ
- వేగవంతమైన, సురక్షితమైన, నమ్మకమైన ప్రయాణం ద్వారా ఆర్థిక వృద్ధి & పర్యాటక ప్రేరణ.

ప్రధాన మంత్రి స్వనిధి - వీధి వ్యాపారులు మరియు నగర జీవనోపాదులు
- వడ్డీ రహిత, UPI-లింక్ క్రెడిట్ మరియు ఆర్థిక సమగ్రతను కల్పించడం
- వీధి వ్యాపారులు మరియు పట్టణ అసంఘటిత కార్మికుల జీవనోపాదికి ఊతం

సైన్స్, ఇన్నోవేషన్ మరియు స్టార్టప్స్ (CSIR-NIIST హబ్)
- అధునాతన పరిశోధన, ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతను ప్రోత్సహించడం
- అంకుర సంస్థల స్థాపనకు మరియు పరిశోధనలను మార్కెట్ పరిష్కారాలుగా మార్చడానికి తోడ్పాటు.

అధునాతన ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు
- SCTIMSTలో ఖచ్చితమైన గామా క్నైఫ్ చికిత్స ద్వారా అధునాతన ఆరోగ్య సంరక్షణ అందుబాటును సులభతరం చేస్తుంది.
- ప్రాంతీయ తృతీయ ఆరోగ్య సంరక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుంది.

పౌర కేంద్రీకృత తపాలా మరియు డిజిటల్ సేవలు
- అధునాతన తపాలా, బ్యాంకింగ్ మరియు డిజిటల్ సేవల లభ్యతను మెరుగుపరచడం
- ప్రజా సేవల పంపిణీలో సామర్థ్యం మరియు నాణ్యతను మెరుగుపరచడం.

నరేంద్ర మోదీ

భారత ప్రధాన మంత్రి
వారి అమృత హస్తాల మీదుగా

శుక్రవారం 23 జనవరి, 2026 | ఉదయం 10:45 గం॥లకు | పుతరికందం గ్రౌండ్, తిరువనంతపురం

వీరి ఘనమైన సమక్షంలో

రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్
గవర్నర్, కేరళ

పినరయి విజయన్
ముఖ్యమంత్రి, కేరళ

జ్యోతిరాదిత్య ఎం. సింధియా
కేంద్ర కమ్యూనికేషన్ల మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి

డాక్టర్ జితేంద్ర సింగ్
కేంద్ర సైన్స్ & టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్ (స్వతంత్ర ప్రతిపత్తి), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది & పెన్షన్లు మరియు అటామిక్ ఎనర్జీ శాఖల సహాయ మంత్రి

డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని
కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి.

వి. సోమన్న
కేంద్ర రైల్వే మరియు జలశక్తి శాఖల సహాయ మంత్రి

రవ్నీత్ సింగ్
కేంద్ర రైల్వే మరియు ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ శాఖల సహాయ మంత్రి

వి. శివన్ కుట్టి
కేరళ రాష్ట్ర సాధారణ విద్యా మరియు కార్మిక శాఖ మంత్రి

Adv. వి. వి. రాజేష్
మేయర్, తిరువనంతపురం

డా. శశి థరూర్
పార్లమెంట్ సభ్యులు

భారతీయ రైల్వే

((•)) DD న్యూస్ లో ప్రత్యక్ష ప్రసారం వీక్షించండి

www.indianrailways.gov.in

అనుసరించండి /RailMinIndia

www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 23-1-2026 | పేజీలు: 12 + 10 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 317 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి రా.1:46 తదుపరి షష్ఠి, నక్షత్రం: పూర్వాభాద్ర మ.2:33 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.12:02-1:37, దుర్ముహూర్తం: ఉ.9:06-9:50, మ.12:49-1:33, అమృతఘడియలు: శేషం ఉ.8:07, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:52, సూర్యాస్తమయం: 6:01 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



గుంటూరు సిటీ వార్తలు



గుంటూరు: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకొని గుంటూరు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతాలివ్వండి మహాప్రభో..!

● జీజీహెచ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేడుకోలు

● 11 నెలలుగా రాని జీతాలు



గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

గుంటూరు సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గత 11 నెలలుగా ఒక్క రూపాయి జీతం అందకపోవడంతో తమ జీవితం అస్తవ్యస్తంగా మారిందని గుంటూరు గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న 27మంది ఉద్యోగులు వాపోతున్నారు. జీతాలు లేక కుటుంబాలను పోషించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని, వాటిని తీర్చలేక తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని అన్నారు. గత నెలలో ఔట్‌సోర్సింగ్ యూనిట్ అయిన అప్కాస్ వెబ్‌సైట్ తాత్కాలికంగా నిలిపివేయడంతో జీతాల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్, జీజీహెచ్ సూపరింటెండెంట్, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌కు ఇప్పటికే విన్నవించుకున్నా పరిష్కారం లేదని పేర్కొన్నారు. తమపై దయచూపి అప్కాస్ వెబ్‌సైట్‌ను వెంటనే ప్రారంభించాలని, పెండింగ్ జీతాలు విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

చంద్రబాబు సమర్థతతోనే విద్యుత్ చార్జీల తగ్గింపు

● రాష్ట్ర మైనార్టీ సెల్ టీడీపీ ప్రధానకార్యదర్శి లాల్‌వజీర్

గుంటూరు(తూర్పు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సమర్థతోనే విద్యుత్ చార్జీల తగ్గాయని రాష్ట్ర మైనార్టీ సెల్ టీడీపీ ప్రధానకార్యదర్శి షేక్ లాల్‌వజీర్ అన్నారు. స్థానిక అరండల్‌పేట జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జగన్ పాలనలో ప్రజలపై ట్రూఆప్ చార్జీలంటూ అధికభారాలు మోపారన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే విద్యుత్ వ్యవస్థను చంద్రబాబు గాడిలో పెట్టారన్నారు. పెంచిన చార్జీలను తగ్గించి సామాన్యులకు ఉపశమనం కల్పించారన్నారు. మరో వైపు అమరావతి, పోలవరాన్ని పూర్తి చేసేందుకు చంద్రబాబు నాయుడు తీవ్ర కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు మద్దతుగా మైనార్టీలు అండగా నిలబడాలని కోరారు. ఈ సమావేశంలో బొబ్బిలి రామారావు, అబ్దుల్ ఖాదర్, షేక్ జాన్ సైదా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు..

మహాభారతం అరణ్యపర్వంపై ప్రవచనం

గుంటూరు (తూర్పు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ స్వామి మహాభారతంలో వ్యాసప్రాస్తం, కవిత్రయంపై ప్రవచనం చేశారు. శుక్రవారం వసంతపంచమి సందర్భంగా సరస్వతీదేవీ పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఆలయకమిటీ సభ్యులు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● డీపీటీవో సామ్రాజ్యం



రక్తదానం చేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సామ్రాజ్యం తదితరులు

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లాప్రజా రవాణాధికారి డి.సామ్రాజ్యం అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఎన్టీఆర్ బస్టాండ్‌లో రక్తదాన శిబిరం జరిగింది. గుంటూరు జీజీహెచ్ పర్యవేక్షణలో జరిగిన రక్తదాన శిబిరంలో పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీపీటీవో మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి అవసరమైన సమయాల్లో రక్తదానం చేసి ప్రాణదాతగా మారవచ్చన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ రామనాయక్, శివరామకృష్ణ, ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మీ, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సినీ గీతాల పోటీలు

గుంటూరు(తూర్పు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో గుంటూరు అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఉగాది పండుగ సందర్భంగా మార్చి 19న రాష్ట్రస్థాయి సినీగీతాల పోటీలను నిర్వహిస్తున్నట్టు కళావేదిక గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ముందుగా తమ పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. పోటీలలో పాల్గొనేవారికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. వివరాలకు 9440109795, 9502403525 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.



- గుంటూరు

తిరుపతిలో నిర్వహించిన బాల్య వివాహ విముక్తి ప్రచార రథం ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సహచర ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

పది ఫలితాల్లో జిల్లాను ప్రథమంలో నిలపాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, హాజరైన విద్యార్థులు

గుంటూరు (విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో ఉంచేలా విద్యార్థులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విజయం మనదే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా, తదితరులు పాల్గొన్నారు.




నాటకుండానే ఎండిపోతున్న మొక్కలు


లక్షలు వెచ్చించి కొన్నారు.. నాటకుండా పడేశారు..

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన మొక్కలను నిరుపయోగంగా ఎండబెడుతున్నారు. స్థానిక గాంధీ పార్కులో వేలాది మొక్కలు ఇలా నిరుపయోగంగా పడి ఉన్నాయి. రోజుల తరబడి మొక్కలకు నీరు పోయకపోవడంతో కొన్ని ఎండి పోయే దశకు చేరుకున్నాయి. నగరంలో నాటేందుకు రూ.65 లక్షలకు పైగా వెచ్చించి ఈ మొక్కలు కొనుగోలు చేసినట్లు నగరపాలక సంస్థ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రజాధనం వృథా అవుతున్నా పాలకులు, అధికారులు పట్టి పట్టినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది ఇప్పటికైనా స్పందించి మొక్కలు పంపిణీ చేసి నాటాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్వీఆర్‌జేసీలో సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, తదితరులు.

గుంటూరు(విద్య), జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. శారీరక, మానసిక ఉత్సాహానికి క్రీడలు దోహదపడతాయని, విద్యార్థులు క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం అలవర్చుకుంటారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ఈ సందర్భంగా క్రీడాకారులకు సూచించారు. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు సెలక్షన్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్, అడ్మిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పి.గౌరీ శంకర్, డాక్టర్ ఎమ్. శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

10కే వాక్ బ్రోచర్ ఆవిష్కరణ

గుంటూరు (విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న నగరంలో నిర్వహించనున్న 10 కిలోమీటర్ల నడక (10కేవాక్) కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలు, టోపీ, బ్రోచర్‌లను ఎమ్మెల్సీ ఆలపాటి రాజా గురువారం ఆవిష్కరించారు. స్థానిక రింగురోడ్డులోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నడకను తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలనే లక్ష్యంతో 10కే వాక్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్, ప్రముఖ నటీమణి కామ్నా జఠ్మలానీ, జబర్దస్త్ నటులు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో 10కె వాక్ కన్వీనర్ డాక్టర్ కోయ సుబ్బారావు, కో కన్వీనర్ పిడికిటి తిలక్ బాబు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వడ్లమూడి పూర్ణచంద్రరావు, లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు లాల్ వజీర్, మలినేని పెరుమాళ్ళు, చిట్టాభత్తిని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళ మృతి

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి గోడను ఢీకొనడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన కేవీపీ కాలనీలో గురువారం జరిగింది. నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేవీపీ కాలనీకి చెందిన వడల నారాయణ (29) మిర్చి యార్డులో కూలి పనులకు వెళుతుంటుంది. బుధవారం రాత్రి ఆమె తన స్కూటీపై వస్తుండగా అదుపుతప్పి గోడకు కొట్టింది. ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త ఆరేళ్ల క్రితం మృతిచెందగా, ఇద్దరు పిల్లలను తానే పోషిస్తోంది. నారాయణ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గురువారం నారాయణ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

● 26 నుంచి పాన్ ఇండియా ప్రచార కార్యక్రమం
● కలెక్టర్ అన్సారియా


పాన్ ఇండియా ప్రచార కార్యక్రమంపై సమీక్షిస్తున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా పాన్ ఇండియా ప్రచార కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 31వ తేదీవరకు పెద్దఎత్తున నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. బాల కార్మికవ్యవస్థ నిర్మూలనకు పెద్దఎత్తున అన్ని శాఖలు సమష్టిగా కృషిచేయాలని ఆదేశించారు. బాల్యవివాహాలు అరికట్టాలని స్పష్టంచేశారు. రక్షించిన చిన్నారులకు వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదురుగా భౌతికంగా లేదా వర్చువల్‌గా హాజరుపరచాలన్నారు. అనంతరం పునరావాసకేంద్రాలకు తరలించాలని చెప్పారు. కార్మికశాఖ ఉపకమిషనర్ ఏ గాయత్రిదేవి మాట్లాడుతూ కార్మిక శాఖ తరపున చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన, బాలల సంరక్షణ అధికారి, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పని చేయాలి: సీఎస్

జిల్లాలో వివిధ ముఖ్య కూడళ్ళు, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీసీ కెమెరాలను రియల్ టైం గవర్నెన్స్ కేంద్రంతో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, ఎంటీఎంసీ అదనపు కమిషనర్ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

● నగర ప్రజలకు కమిషనర్ మయూర్ అశోక్ విజ్ఞప్తి



గుంటూరుకార్పొరేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పురపాలక సేవలను ఇంటి నుంచే ఫోన్ ద్వారా పొందడానికి పురమిత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని నగర ప్రజలకు కమిషనర్ మయూర్ అశోక్ విజ్ఞప్తి చేశారు. నగరంలో ఇప్పటికి 55,265 మంది మాత్రమే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. యాప్ డౌన్‌లోడ్‌లో రాష్ట్రంలో నగరం 6వ స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. పురమిత్ర యాప్ ద్వారా సుమారు 122 రకాల పురపాలక సేవలు పొందవచ్చన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు తమ సమస్య, లేదా దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చన్నారు. నగర ప్రజలు పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ


ఏపీఈఆర్‌సీ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎస్ఈ రమేష్, ఎస్ఏవో రామిరెడ్డి తదితరులు

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రిటైల్ ధరలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ఏపీఈఆర్‌సీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి విద్యుత్ భవన్‌లో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, ఎస్ఏవో పాశం రామిరెడ్డి, టెక్నికల్ ఈఈ నాగేశ్వరరావు హాజరయ్యారు. కాగా, గుంటూరు నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలియజేసే వారు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకాలేదు. కొందరు వినియోగదారులు నేరుగా విజయవాడలోని సమావేశానికి హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా శుక్రవారంతోపాటు, ఈ నెల 27న కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు.

నందివెలుగు రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి నిధులివ్వండి

● మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరిన ఎమ్మెల్యే నసీర్


రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిప్రతం అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని నందివెలుగు రోడ్డులో కల్వర్టు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నసీర్ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. వెలగపూడి సచివాలయంలో గురువారం ఆయన మంత్రి కేశవ్‌కు వినతి పత్రం అందజేశారు. కల్వర్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కల్వర్టు నిర్మాణం అత్యంత ప్రాధాన్యమైందని ఆయన మంత్రికి తెలిపారు. ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గుంటూరు తూర్పు నియోజకవర్గానికి ఎటువంటి ఆర్‌అండ్‌బీ పనులు మంజూరు కాలేదని ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. ప్రతిష్ఠాత్మకమైన, ప్రజోపయోగకమైన కల్వర్టు నిర్మాణానికి వెంటనే పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నసీర్ విన్నవించారు. తన వినతికి మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారని, వారం రోజుల్లో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు(తూర్పు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ బీజేపీని మరింత బలోపేతం చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం లాలుపురం వాజ్‌పేయి భవనంలో చెరుకూరి తిరుపతిరావు అభినందన సభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ హజరై తిరుపతిరావును సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను తిరుపతిరావు విజయవంతం చేశారని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా నగరంలో వాజ్‌పేయి విగ్రహ స్థాపనలో ఆయన కృషి గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు జాతీయ స్పైసెస్ బోర్డ్ సభ్యుడు కొత్తూరి వెంకట సుబ్బారావు, నేరెళ్ల మాధవరావు, భీమినేని చంద్రశేఖర్, శ్రీనివాస్, వైవీ సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొని చెరుకూరి తిరుపతిరావును అభినందించారు.

స్మార్ట్ కిచెన్ ఆలోచనను విరమించుకోవాలి

గుంటూరు(తూర్పు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కిచెన్ వ్యవస్థ ప్రవేశపెట్టాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని మధ్యాహ్నభోజన కార్మికుల యూనియన్ (సిఐటియూ) జిల్లా గౌరవాధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పాతగుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు మధ్యాహ్నభోజన వ్యవస్థ లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నాయని అన్నారు. ఈ వ్యవస్థ సక్రమంగా లేకపోతే విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరవై అయిదేళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం, ప్రమాద బీమా ఇతర సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రాష్ట్రంలోని టీడీపీ, వైసీపీ బలపరచడం బాధాకరమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కరించకపోతే ఫిబ్రవరి 12 సమ్మెలో భాగస్వాములు అవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కల్యాణీ, షమి, దేవకుమారి, ద్రాక్షావలి, సుమతి, అరుణ, రాణి, విమల పాల్గొన్నారు.

ఘనంగా కేంద్రియ విద్యాలయం వార్షికోత్సవం


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎఫ్‌ట్రానిక్స్ ఎండీ దాసరి రామకృష్ణ తదితరులు

గుంటూరు (విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎఫ్‌ట్రానిక్స్ ఎండీ దాసరి రామకృష్ణ, పాఠశాల చైర్మన్, సీజీఎస్‌టీ కమిషనర్ సుజిత్‌మాలిక్, సంయుక్త కమిషనర్ దేవకుమార్ రజ్వాని తదితరులు హాజరయ్యారు. ముఖ్య అతిథి దాసరి రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, తల్లిదండ్రుల ఆశయాల్ని, ఆశల్ని నేరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బొంతా శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్

కేంద్రీయ విద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ ల్యాబ్‌ను గుంటూరు కేంద్ర పన్నుల కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి సుజిత్ మాలిక్, ఎఫ్‌ట్రానిక్స్ ఎండీ దాసరి రామకృష్ణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంప్యూటర్లను విరాళంగా ఇచ్చిన దాసరి రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ బొంత శేఖర్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు నాగేశ్వరరావు, ఆర్‌పీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి మహాసభను జయప్రదం చేయండి

గుంటూరు (తూర్పు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫిబ్రవరి 5న జరిగే ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ మహాసభను జయప్రదం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి ప్రధానకార్యదర్శి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. రెవెన్యూ భవనంలో గురువారం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదులమూడి మధుబాబుతో కలిసి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పి.శివసైదారావు, కేశవ, రాయపూడి కోటి బాబు, మోదుకూరి రమేష్, దుంపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పనిదినాల్ని అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బ్యాంకు రంగంలో 5రోజుల పనిదినాలను అమలుచేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్(యూఎఫ్‌బీయూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంపాలెం ఎస్‌బీఐ ప్రధానకార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం నెలలో రెండవ, నాలుగు శనివారాలు సెలవులుగా ఉన్నాయని, మిగిలిన శనివారాలను కూడా సెలవులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనిపై గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికీ అమలుపరచలేదన్నారు. బ్యాంకులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ నిరసనల్లో ఎస్‌బీఐ మాడ్యూల్ అఫీసర్స్ అసోసియేషన్ కేఆర్‌వీ జయకుమార్, కె.కొటిరెడ్డి, రంగసాయి, పి.కిషోర్, రవిచంద్రరెడ్డి, బాషా, రాంబాబు, కల్యాణ్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరులో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, ఏటుకూరుకు చెందిన శివకిషోర్ మిర్చియార్డులో గుమస్తాగా పనిచేస్తుంటాడు. మానసికంగా బాధపడుతున్న అతను కొంతకాలంగా ఉద్యోగానికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తల్లి వెంటనే స్థానికుల సాయంతో కిందకు దించి ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఏపీ కిసాన్ సభ కార్డు ఇన్‌చార్జిగా కన్నా

గుంటూరు (తూర్పు), జనవరి 22 (ఆంధ్ర జ్యోతి): భారత ప్రభుత్వం వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో పని చేసే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి కిసాన్ సభ గుర్తింపు కార్డు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇన్‌చార్జిగా బీజేపీ నాయకుడు కన్నా రవిదేవరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా లాలుపురం బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర, సొసైటీలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ కార్డు పనిచేస్తుందన్నారు. ఈ కార్డు లబ్ధిదారులకు బీమా సదుపాయం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపి లో ప్రతి రైతుకు ఈ కార్డు అందేలా కృషిచేస్తానని అన్నారు. జిల్లా అధికారులతో ఈ కార్డుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, ఈదర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని రవి దేవరాజును అభినందించారు.

ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్ (2), ఫార్మసిస్ట్ (1), డేటా ఎంట్రీ ఆపరేటర్ (3), ఎల్‌జీఎస్ (6), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్ (2), ఎఫ్ఎన్‌వో (7), శానిటరీ అటెండర్ కమ్ నైట్ వాచ్‌మన్ (20) పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జనవరి 23వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

ఘనంగా కనకదుర్గ ఆలయ వార్షికోత్సవాలు

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు రోడ్డులోని సంగడిగుంట వద్దనున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో వార్షికోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయ ధ్వజస్తంభ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మహిళా భక్తులతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మోరబోయిన నరసింహరావు, జాయింట్ సెక్రటరీ మల్లం సత్యనారాయణ, అరవ ఆంజనేయులు, తక్కెళ్ళపాటి మస్తాన్‌రావు, అప్పారావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా గురువారం ముత్తయిదువులతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఈసీ సభ్యుడు కొనకళ్ళ సత్యం, ఉత్సవ కమిటీ చైర్మన్ కోట శేషగిరిరావు, కాకుమాను శ్రీనివాసరావు, కారంశెట్టి లోకేశ్, జూలూరి హేమాంగద గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్మశానం ప్రహరీ గోడ కుల్చివేత

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలోని అడవి తక్కెళ్ళపాడు స్మశాన వాటిక ప్రహరీగోడను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం కూల్చివేశారు. గతంలో దీనిపై కోర్టు వివాదం ఉండడంతో నగరపాలక సంస్థ అధికారులు కోర్టుకు సమాధానమిచ్చారు. ఈ క్రమంలో స్మశాన ప్రహరీ గోడ నిర్మాణానికి టెండర్లు పిలవగా సంజయ్ అనే కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ దక్కించుకొని చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఇలా ఉంటే కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీగోడ కూల్చివేశారు. స్థానిక సచివాలయ ఎమినిటీ సెక్రటరీ దేశవత్ ఈశ్వర నాయక్ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి:ఎస్పీ

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ మొదలైన నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ పద్ధతులలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరస్థులు సీనియర్ సిటిజన్లకు వాట్సాప్ ఫోన్లు చేసి బెదిరించి వసూళ్ళకు పాల్పడుతున్నారన్నారు. డిజిటల్ అరెస్ట్ అని ఎవరైనా అంటే భయపడాల్సిన పని లేదని, అటువంటి ఫోన్లు వస్తే కట్ చేయాలన్నారు. మీ ఫోన్ ద్వారా అశ్లీల ఫోటోలు పంపినట్లు కేసు నమోదైంది, దాని నుంచి బయటపడాలంటే డబ్బులు డిపాజిట్ చేయమని ఎవరైనా పోలీసులమని చెప్పి బెదిరింపు కాల్స్ చేస్తే వెంటనే సైబర్ పోలీసులను సంప్రదించాలన్నారు. సైబర్ మోసగాళ్లు, పోలీస్, కోర్టు, కస్టమ్స్, టెలికాం అధికారులమని చెప్పి ఫోన్లు చేస్తారని చెప్పారు. ఫోన్లో వచ్చే ఎలాంటి ఏపీకె ఫైల్స్‌ను, లింకులను తెరవొద్దని సూచించారు. అనుమానాస్పద ఫోన్లు వస్తే వెంటనే కట్ చేసి సమీప సైబర్ క్రైమ్ పోలీసులకు, లేదా 1930ను సంప్రదించాలని ఎస్పీ పేర్కొన్నారు.